ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -77 పేజీలు - 08 వెల - 04/- శనివారం 28 డిసెంబర్ 2024

# దేశం గొప్ప ఆర్థిక సంస్కర్తను కోల్పోయింది





- మన్మోహన్‌కు ప్రముఖుల నివాళి
- ఇంటికి వెళ్లి నివాళి అర్పించిన రాష్ట్రపతి ముర్ము
- ప్రధాని మోడీ, అమిత్ షా తదితరుల శ్రద్ధాంజలి
- కేబినెట్ భేటీలో ఘనంగా నివాళి
- వారంపాటు దేశంలో సంతాపదినాలు
- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు
- ప్రధాన కార్యాలయాలపై జాతీయజెండా అవనతం

భారత మాజీ ప్రధాని, కాంగ్రెస్ సీనియర్ నేత మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షా, బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా తదితర ప్రముఖులు నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మన్మోహన్ సింగ్ మృతిపై రాజకీయ, సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. ఆయన పార్థివదేహానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరంద్రమోదీ నివాళులర్పించారు.

న్యూఢిల్లీ,డిసెంబర్27ఆంధ్ర ప్రగతి : ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'ఆర్థికవేత్తగా, సంస్కరణల సారథిగా మన్మోహన్ సింగ్‌ను దేశం గుర్తుంచుకుంటుంది. ఆర్‌బీఐ గవర్నర్ సహా అనేక కీలక పదవుల్లో దేశానికి సేవలందించారు. పీవీ హయాంలో ఆర్థికమంత్రిగా దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చివేశారు. దేశం, ప్రజల పట్ల



ఆయన సేవాభావం స్మరించుకోదగినది. విలక్షణ పార్లమెంటేరియన్‌గా ఆయన సేవలు అందించారు. ఎన్నో కీలక పదవులు చేపట్టినా నిరాడంబర జీవితం గడిపారు. జాతీయ, అంతర్జాతీయ అంశాలపై ఆయనతో చాలాసార్లు మాట్లాడా. ఆయన మృతి విచారకరం. నా తరఫున, దేశ ప్రజల తరఫున శ్రద్ధాంజలి ఘటిస్తున్నా' అని మోదీ తెలిపారు.

మిగతాది 2లో...

# భావితరాలకు మన్మోహన్ ఆదర్శం

## మన్మోహన్ సింగ్ భౌతికకాయానికి నివాళులు అర్పించిన ఏపీ సీఎం చంద్రబాబు



ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి నివాళులు అర్పించారు. చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ ఎంపీలు కేశినేని చిన్ని, డాక్టర్ బైరెడ్డి శబరి కూడా మన్మోహన్ సింగ్ కు నివాళులు అర్పించారు. అనంతరం, మన్మోహన్ కుటుంబ సభ్యులను చంద్రబాబు పరామర్శించారు. మిగతాది 2లో...

### అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్ విచారణ

# సోమవారానికి వాయిదా వేసిన కోర్టు

## వర్చువల్‌గా పాల్గొన్న బన్నీ



హైదరాబాద్,డిసెంబర్27ఆంధ్ర ప్రగతి : నటుడు అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్‌పై విచారణను నాంపల్లి కోర్టు సోమవారానికి వాయిదా వేసింది. బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయడానికి పోలీసులు సమయం కోరారు. సంధ్య థియేటర్ ఘటనలో నాంపల్లి కోర్టులో జరిగిన విచారణకు వర్చువల్‌గా అల్లు అర్జున్ హాజరయ్యారు. విచారణను జనవరి 10కి నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. గతంలో అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. మిగతాది 2లో...

# గాలివీడు ఎంపీడీవోపై వైసీపీ నేత దాడి

- తీవ్రంగా గాయపడి రిమ్స్ లో చికిత్స పొందుతున్న జవహర్ బాబు
- ఈ ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్న పవన్ కల్యాణ్
- దాడికి పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు
- నేడు కడప వెళ్లనున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



అన్నమయ్యడిసెంబర్27ఆంధ్ర ప్రగతి : గాలివీడు ఎంపీడీఓ జవహర్ బాబుపై మండల పరిషత్ కార్యాలయంలో వైసీపీ నేత సుదర్శన్ రెడ్డి, అతని అనుచరులు తీవ్రస్థాయిలో దాడి చేశారు. ఈ దాడి ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సీరియస్ అయ్యారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీఓ శ్రీ జవహర్ బాబుపై దాడి ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని, మండల పరిషత్ కార్యాలయంలోకి చొరబడి దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ప్రకటించారు. విధి నిర్వహణలో ఉన్న %వీుణూ% పై దాడి చేయడం అప్రజాస్వామిక చర్య, ఇటువంటి దౌర్జన్యాలకు, రౌడీ చర్యలకు కూటమి ప్రభుత్వంలో తావు లేదని స్పష్టం చేశారు.

మిగతాది 2లో...

# విద్యుత్ పెంచిన వారే ధర్నాలు చేయడం సిగ్గుచేటు

## జగన్‌ది పిచ్చి తుగ్లక్ వైఖరి

## మంత్రి అనగాని సత్యప్రసాద్



అమరావతి, డిసెంబర్27ఆంధ్ర ప్రగతి : రాష్ట్రంలో కరెంట్ చార్జీల పెంపుపై వైసీపీ చేస్తున్న ధర్నాపై ఏపీ మంత్రులు, ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ హయాంలో పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా వైసీపీ నేతలనే నిరసన చేయడం సిగ్గు చేటు అంటూ విమర్శలు గుప్పించారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ.. తన పాలనలో రాష్ట్ర విద్యుత్ రంగంపై దాదాపు లక్షా 30 వేల కోట్ల రూపాయల భారాన్ని మోపిన జగన్ ఇప్పుడు చిలకపలుకులు పలుకుతున్నారని మండిపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. మిగతాది 2లో...

# విద్యుత్ ఛార్జీల పెంపుపై వైసిపి పోరుబాట

- రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ కేంద్రాల వద్ద ధర్నాలు
- పలు ప్రాంతాలలో రోడ్లపై బైఠాయించి నిరసనలు
- విద్యుత్‌పై నాలుక మడతేసిన చంద్రబాబు
- వైకాపా ఆందోళనలో విమర్శలు గుప్పించిన అంబటి




అమరావతిడిసెంబర్27ఆంధ్ర ప్రగతి : కరెంట్ ఛార్జీల పెంపుపై వైసీపీ పోరుబాటను నిర్వహించింది. రాష్ట్రువ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో కరెంటు చార్జీల పెంపునకు నిరసునగా, ప్రజలకు తోడుగా నిలుస్తూ ఆందోళన చేపట్టాలంటూ వైయస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన పిలుపుతో పార్టీ శ్రేణులు ష్టవ్యాప్తంగా విద్యుత్ కార్యాలయాల వద్ద వైయస్‌ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తల నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మిగతాది 2లో...

# ఏపీలో రద్దీగా మారిన రిజిస్ట్రేషన్ కార్యాలయాలు

- ఏపీలో పెరగనున్న రిజిస్ట్రేషన్ చార్జీలు
- తొలుత జనవరి 1 నుంచి ధరలు పెంచాలనుకున్న కూటమి సర్కారు
- ఈ నేపథ్యంలో, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు భారీగా వస్తున్న ప్రజలు



అమరావతిడిసెంబర్27ఆంధ్ర ప్రగతి : ఏపీలో రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే చార్జీల పెంపుదలపై ప్రతిపాదనలను అధికారులు ప్రభుత్వం ముందుంచారు. జనవరి 1 నుంచి కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలను అమలు చేయాలని భావించినప్పటికీ, విధివిధానాలపై కసరత్తులకు మరికొంత సమయం పట్టేట్టు ఉండడంతో ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం వాయిదా వేసింది. ఇక, కొత్త చార్జీల అమలు ఎప్పటి నుంచి అనేది కచ్చితంగా తెలియకపోయినప్పటికీ.. మిగతాది 2లో...

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



## ఏపీలో రద్దీగా మారిన రిజిస్ట్రేషన్ కార్యాలయాలు

(మొదటి పేజి తరువాయి)

రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు ఖాయమైన నేపథ్యంలో, ఇవాళ రాష్ట్రంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు రద్దీతో కిటకిటలాడాయి. చార్జీలు పెంచేంత వరకు ఆగకుండా... ఆస్తుల రిజిస్ట్రేషన్లు, క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తుండడంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద కోలాహలం నెలకొంది. సాధారణ దినాలతో పోల్చితే రెట్టింపు సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. కాగా, కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలపై సోమవారం నాడు స్పష్టత వస్తుందని భావిస్తున్నారు.

## భావితరాలకు మన్మోహన్ ఆదర్శం

(మొదటి పేజి తరువాయి)



అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ, దేశం గొప్ప ఆర్థిక సంస్కర్తను కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. దేశానికి మన్మోహన్ అవిశ్రాంతంగా సేవలందించారని, ఆయన మరణం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. మన్మోహన్ తన సుదీర్ఘ ప్రస్థానంలో అనేక ఉన్నత పదవులు చేపట్టారని, ఆయా పదవులను సమర్థవంతంగా నిర్వర్తించారని కీర్తించారు. దూరదృష్టితో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చారని చంద్రబాబు కొనియాడారు. ఉపాధి హామీ, ఆధార్, ఆర్టీఐ, విద్యా హక్కు చట్టం తీసుకువచ్చారని వెల్లడించారు.

## పారిశ్రామిక ఉపాధి ఉచిత శిక్షణ కు దరఖాస్తు చేసుకోండి.!

**-సీడప్ ద్వారా మైనారిటీ యువతకు ఉచిత శిక్షణ.**
**-రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.**



ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబరు 27:
రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్ నిర్వహణలో పారిశ్రామిక రంగంలో ఉపాధి, స్వయం ఉపాధికి ఇస్తున్న ఉచిత శిక్షణకు రాష్ట్రంలోని మైనార్టీలకు చెందిన యువత దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. సంఘటిత రంగంలో ఉపాధి అవకాశాలను అందించడానికి మరియు అవసరమైన సహాయాన్ని అందించడం ద్వారా పారిశ్రామికవేత్తలు/స్వయం ఉపాధిని సృష్టించడానికి పరిశ్రమ ఆధారిత నైపుణ్యాలతో యువతకు సాధికారత కల్పించడానికి ప్రభుత్వ%శీ% కృషి చేస్తున్నదని అన్నారు. ఇందులో భాగంగా సీడప్ నిరుద్యోగ యువత కోసం వివిధ నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. నైపుణ్యం కలిగిన యువతను అవసరమైన పరిశ్రమల యజమానులతో అనుసంధానించడం జరుగుతుందన్నారు . పరిశ్రమల అవసరాలకు సరిపోలని నైపుణ్యాలు ఉన్నవారికి, నాణ్యమైన రెసిడెన్షియల్ శిక్షణలను ఉచితంగా సీడప్ అందించి స్కిల్ గ్యాప్‌ని భర్తీ చేస్తుందని తెలిపారు. ఉచిత శిక్షణలో రవాణా, కెరీర్ కౌన్సెలింగ్, యూనిఫాం, వసతి, ఆహారం, స్టడీ మెటీరియల్, ఉద్యోగ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.ఎన్ ఎస్ డి సి ద్వారా సర్టిఫికేషన్, ఉద్యోగ నియామకాలు, పోస్ట్ జాబ్ ప్లేస్ మెంట్ కు మద్దతు కూడా ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాల్లో ఉన్న మైనార్టీల సంక్షేమ/మైనారిటీల ఫైనాన్స్ కార్యాలయాలలో మైనార్టీ యువత ఉచిత శిక్షణ పొందుటకు తమ దరఖాస్తు ఫారాలను అందించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఫరూక్ కోరారు.

## అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్ విచారణ సోమవారానికి వాయిదా వేసిన కోర్టు

(మొదటి పేజి తరువాయి)

రిమాండ్ గడువు ముగియడంతో కోర్టు ముందుకు అల్లు అర్జున్ హాజరయ్యారు. డిసెంబర్ 4న ఆర్ టిసి క్రాస్ రోడ్డులో సంధ్య థియేటర్ లో పుష్ప 2 సినిమా విడుదల కావడంతో పాటు హీరో అల్లు అర్జున్ అక్కడికి రావడంతో తొక్కిసలాట జరిగి రేవతి అనే మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. మొత్తంగా టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్ విచారణ సోమవారానికి వాయిదా పడింది. ప్రస్తుతం మధ్యంతర బెయిల్ మీద బయట ఉన్న అల్లు అర్జున్ రెగ్యూలర్ బెయిల్ పిటిషన్ కోసం నాంపల్లి కోర్టులో పిటిషన్ వేశారు. మరోవైపు రెండు వారాల జ్యుడీషియల్ రిమాండ్ గడువు సైతం పూర్తి కావడంతో హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చిన విషయాన్ని నాంపల్లి కోర్టుకు తెలిపారు. రెగ్యూలర్ బెయిల్ పిటిషన్ కోసం అల్లు అర్జున్ తరఫున ఆయన లాయర్లు కోర్టులో పిటిషన్ వేశారు. నాంపల్లి కోర్టు ఈ పిటిషన్ విచారణ స్వీకరించింది. కోర్టులో విచారణ ప్రారంభం కాగా, కౌంటర్ ధాఖలు చేసేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమయం కోరారు. దాంతో నాంపల్లి కోర్టు తదుపరి విచారణ వచ్చే సోమవారానికి వాయిదా వేసింది. అల్లు అర్జున్ నేరుగా కాకుండా వర్చువల్ గా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యారు. మొదట అల్లు అర్జున్ విచారణకు వస్తారని నాంపల్లి కోర్టు వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే వర్చువల్‌గా హాజరు అవుతారని ఆయన తరఫున లాయర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లగా, అల్లు అర్జున్ అభ్యర్థనను కోర్టు మన్నించింది. నాంపల్లి కోర్టు విధించిన జ్యుడీషియల్ రిమాండ్ గడువు నేటితో ముగియనుందని విచారణ జరిపారు. పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా డిసెంబర్ 4వ తేదీన సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ చనిపోగా, ఆమె కుమారుడు కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. థియేటర్ వద్ద తొక్కిసలాట కేసు విచారణనూ సైతం నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. జనవరి 10వ తేదీన తదుపరి విచారణను చేపట్టనున్నట్లు కోర్టు వెల్లడించింది. అల్లు అర్జున్ రిమాండ్ పై సైతం అదేరోజు విచారణ జరగనుంది.

## పేర్ని జయసుధ బెయిల్‌పై ముగిసిన వాదనలు



అమరావతిడిసెంబర్27ఆంధ్ర ప్రగతి :
మాజీ మంత్రి పేర్ని నాని సతీమణి జయసుధ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. వాదనలు విన్న న్యాయమూర్తి ఈనెల 30న బెయిల్ పిటిషన్‌పై ఉత్తర్వులు ఇవ్వనున్నారు. పేర్ని నాని తన సతీమణి పేరుతో పౌరసరఫరాల సంస్థకు మచిలీపట్నంలో గోదాము అ÷-దదెకిచ్చారు. ఇందులో నిల్వ ఉంచిన 3,708 బస్తాల రేషన్ బియ్యం మాయమవడంతో పౌరసరఫరాల శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జయసుధతో పాటు గోదాము మేనేజర్ మానస్ తేజపై మచిలీపట్నం తాలూకా స్టేషన్‌లో కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అరెస్టు నుంచి తప్పించుకునేందుకు జయసుధ మచిలీపట్నం 9వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఆమె తరఫున సీనియర్ న్యాయవాది వరదరాజులు వాదనలు వినిపించారు. ప్రభుత్వం తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా లంకే వెంకటేశ్వరరావు వ్యవహరించారు.

# దేశం గొప్ప ఆర్థిక సంస్కర్తను కోల్పోయింది

(మొదటి పేజి తరువాయి)

అంత్యక్రియలను పూర్తి అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు ఇప్పటికే కేంద్రం ప్రకటించింది. మోడీ అధ్యక్షతన కేంద్ర కేబినేట్ అత్యవసరంగా సమావేశమై ఘనంగా నివాళి అర్పించింది. వారంపాటు సంతాపదినాలు ప్రకటించింది. మన్మోహన్ మృతికి సంతాప సూచకంగా కేంద్ర ప్రభుత్వం 7 రోజులు సంతాప దినాలను ప్రకటించింది. రాష్ట్రపతి భవన్ సహా అన్ని ప్రభుత్వ భవనాలపై జాతీయ పతాకాన్ని సగానికి అవనతం చేశారు. అటు ఏఐసీసీ ప్రధాన కార్యాలయంపైనా జాతీయజెండాను సగానికి దించారు. కాంగ్రెస్ పార్టీ కూడా వచ్చే ఏడు రోజుల పాటు కార్యక్రమాలన్నింటినీ



రద్దు చేసుకుంది.92 ఏళ్ల మన్మోహన్ సింగ్ వయసురీత్యా తలెత్తిన అనారోగ్య సమస్యలతో గత రాత్రి ఇంటివద్ద అకస్మాత్తుగా స్పృహ కోల్పోయారు. దీంతో కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మన్మోహన్ పదేళ్ల పాటు దేశానికి ప్రధానిగా సేవలందించారు. అంతకుముందు ఆర్‌బీఐ గవర్నర్‌గా వ్యవహరించారు. ప్రధానిగా పీవీ నరసింహారావు హయాంలో ఆర్థిక మంత్రిగానూ బాధ్యతలు నిర్వర్తించారు. మన్మోహన్ సింగ్ అంత్యక్రియలను పూర్తి అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు ఇప్పటికే కేంద్రం వెల్లడించింది. ఆయన మృతికి సంతాప సూచికంగా 7 రోజులు సంతాప దినాలను ప్రకటించింది. ప్రజల సందర్శనార్థం శనివారం ఆయన భౌతికకాయాన్ని ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తీసుకురానున్నారు. శనివారం రాజ్‌ఘాట్ సమీపంలో ఆయన అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

# విద్యుత్ ఛార్జీల పెంపుపై వైసిపి పోరుబాట

(మొదటి పేజి తరువాయి)

రాష్ట్రప్రజలపై రూ. 15 వేల కోట్ల అదనపు భారం మోపిందని ఆరోపించింది. ఛార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.
చిత్తూరు జిల్లాలో చిత్తూరు జిల్లా కేంద్రంలో నిర్వహించిన నిరసనలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ బిల్లుల పేరుతో ప్రజలను దోపిడీ చేస్తున్నారని, ఎన్నికలకు ముందు మాటలకు ఇప్పటి చేతలకు సంబంధం లేదని పేర్కొన్నారు. పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ గతంలో విద్యుత్ బిల్లులు తగ్గించాలని రైతులు డిమాండ్ చేస్తే వారిపై కాల్పులు జరిపిన ఘనుడు చంద్రబాబు అన్ని ఆరోపించారు. నగరిలో మాజీ మంత్రి రోజా నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. బాబు ష్యురిటీ.. బాదుడు గ్యారంటీ అన్నట్లుగా చంద్రబాబు పాలన ఉందని విమర్శించారు. ఓటేసిన ప్రజలను చంద్రబాబు ప్రభుత్వం కాటేస్తుందని ఆరోపించారు.
కాకినాడ విద్యుత్ డీఈ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసనలో కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



ఇక, తునిలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, పిఠాపురంలో వంగా గీతా, పెద్దాపురంలో దవులూరి దొరబాబు, జగ్గంపేటలో తోట నరసింహం, విశాఖ సౌత్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్, అనంతపురంలో మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి. శింగనమల నియోజకవర్గంలో ఆలూరు సాంబశివారెడ్డి, ఉరవకొండ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి , నంద్యాలలో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, పాణ్యంలో మాజీ ఎమ్మెల్యే, నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ కాటసాని రాంభూపాల్ రెడ్డి అధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు.

# విద్యుత్ పెంచిన వారే ధర్నాలు చేయడం సిగ్గుచేటు

(మొదటి పేజి తరువాయి)

యూనిట్‌కు ఐదు రూపాయలకు దొరికే విద్యుత్‌కు బదులు 8 నుంచి 14 రూపాయల వరకు కొనుగోలు చేసి ప్రజలపైన జగన్ రెడ్డి మోయలేని భారాన్ని మోపారన్నారు. సోలార్, విండ్ ఎనర్జీ పీపీఎలను రద్దు చేసి రాష్ట్రానికి 10 వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్తును జగన్ అందుబాటులో లేకుండా చేశారని విమర్శించారు. 2022 నుంచి 2024 వరకు రెండేళ్ల కాలానికి రూ.17 వేల కోట్ల ట్రూఅప్ ఛార్జీలను పెంచాలని అనాడే జగన్ సర్కార్ ఆమోదించిందన్నారు. ఆ ట్రూ అప్ ఛార్జీలనే రెండేళ్ల పాటు పెంచకుండా ప్రస్తుతం డిసెంబర్ నుంచి అమలు చేయాలంటూ ఈఆర్సీ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. తాను పెంచాలని సూచించిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా తానే పోరాటం చేయడం పిచ్చి తుగ్లక్ జగన్‌కు మాత్రమే చెల్లిందంటూ మంత్రి అనగాని సత్యప్రసాద్ విరుచుకుపడ్డారు.

### జగన్ కొత్త డ్రామాలకు తెర: ప్రత్తిపాటి

పల్నాడు జిల్లా: ప్రజల చేతిలో క్షవరం అయినా జగన్ రెడ్డికి, వైసీపీ నేతలకు తత్వం బోధపడలేదని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టినా జగన్ రెడ్డి, అతడి టీమ్ పద్ధతి మార్చుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వానికి పెరుగుతున్న ప్రజల మద్దతు చూసి ఓర్వలేక జగన్ కొత్త డ్రామాలకు తెరలేపారన్నారు. ప్రస్తుతం ప్రజలపై పడిన విద్యుత్ చార్జీల భారం జగన్ అవినీతి , అత్యాశల వల్లే అని వ్యాఖ్యలు చేశారు. తన పాలనలో జగన్ రాష్ట్ర విద్యుత్ రంగానికి చేసిన నష్టం రూ. 1,29,503 కోట్లు అని తెలిపారు. ఐదేళ్లలో 10 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి, ప్రజల నడ్డివిరిచి మరీ జగన్ రూ.32,166 కోట్లు. దండుకున్నారన్నారు. తన పాలనలో జగన్ విద్యుత్ సంస్థలపై వేసిన అప్పులే రూ. 50 వేల కోట్లు అని తెలిపారు. అస్తవ్యస్త నిర్ణయాలు, అవినీతి అత్యాశతో రాష్ట్రాన్ని, విద్యుత్ రంగాన్ని నాశనం చేసిన ఘనత జగన్ దే అంటూ ప్రత్తిపాటి పుల్లారావు వ్యాఖ్యలు చేశారు.

### చంద్రబాబుకు ఏ సంబంధం లేదు : కాల్వ శ్రీనివాసులు

కూటమి ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి వైసీపీ ఓర్వటం లేదని రాయదుర్గం ఎమ్మెల్యే , ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు అన్నారు. మొన్న రైతు కోసం, ఇవాళ కరెంట్ చార్జీల పెంపుపై ర్యాలీ హాస్యాస్పదంగా ఉందన్నారు. కరెంట్ చార్జీల పెంపునకు చంద్రబాబుకు ఏ మాత్రం సంబంధం లేదని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ పాపాలే ఇవాళ ఛార్జీలు పెంపు పరిస్థితికి కారణమని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వమే విద్యుత్ కొనుగోలుకు ప్రతిపాదనలు ఇచ్చారని.. విద్యుత్ రంగాన్ని స్వార్థపూరిత ఆలోచలతో నాశనం చేశారన్నారు. అస్తవ్యస్త పాలనతో ప్రజలపై భారం మోపారని తెలిపారు. వైసీపీ చేసిన మోసానికి ఇవాళ వారే ర్యాలీలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను మభ్యపెడుతూ అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. జగన్ మోహన్ రెడ్డికి ప్రజా సమస్యలపై మాట్లాడే అర్హత లేదన్నారు. వైసీపీ ఆది నుంచి అసత్యాలు ప్రచారం చేస్తోందని.. దీన్ని ప్రజలు గమనించాలన్నారు. జగన్ పాపాలు కడిగేస్తూ.. రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. జగన్ ఎన్ని కుట్రలు చేసినా.. కూటమి ప్రభుత్వం ఈ రాష్ట్రాన్ని శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా తీసుకొస్తుందని కాల్వ శ్రీనివాసులు స్పష్టం చేశారు.

## గాలివీడు ఎంపీడీవోపై వైసీపీ నేత దాడి

(మొదటి పేజి తరువాయి)



గాలివీడు ఎంపీడీఓపై చోటు చేసుకున్న దాడి ఘటన గురించి అధికారులతో ఆయన చర్చించారు..కారకులైన నిందితులపై కఠినంగా వ్యవహరించాలని, బాధిత ఎంపీడీఓకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఎంపీడీఓకు, ఆయన కుటుంబానికి ధైర్యం చెప్పాలని సూచించారు. జవహర్ బాబుపై దాడి చేసినవారికి రాజ్యాంగం పట్ల, ప్రజాస్వామ్యం పట్లా ఏ మాత్రం గౌరవం లేదని అర్థం అవుతోందని, దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా బలమైన సంకేతం ఇవ్వాలని చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో చోటు చేసుకున్న అప్రజాస్వామిక దాడిపై విచారణ చేయడంతోపాటు ఎంపీడీఓ ఆరోగ్యం గురించి వాకబు చేసి నివేదిక ఇవ్వాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ను ఆదేశించారుఇక జవహర్ బాబును పరామర్శించి ధైర్యం చెప్పాలని ఆయన నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యం లోనే రేపు పవన్ కడప వెళ్లనున్నారు. వైసీపీ నాయకుల దాడిలో గాయపడి, కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపీడీఓ జవహర్ బాబును పరామర్శించనున్నారు.

## రఘురామ కేసు : విజయపాల్ బెయిల్, కస్టడీ పిటిషన్లపై విచారణ వాయిదా

**రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసులో విజయపాల్ పై ఆరోపణలు**
**ప్రస్తుతం గుంటూరు జైలులో ఉన్న సీఐడీ మాజీ అధికారి**
**బెయిల్, కస్టడీ పిటిషన్లపై తదుపరి విచారణ ఈ నెల 30కి వాయిదా**



అమరావతిడిసెంబర్27ఆంధ్ర ప్రగతి :
ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును గత ప్రభుత్వ హయాంలో చిత్రహింసలు పెట్టిన కేసులో సీఐడీ మాజీ అదనపు ఎస్పీ విజయపాల్ అరెస్టయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం విజయపాల్ గుంటూరు జైలులో ఉన్నారు. ఇవాళ విజయపాల్ బెయిల్ పిటిషన్, సీఐడీ అధికారుల కస్టడీ పిటిషన్లపై గుంటూరు కోర్టు విచారణ చేపట్టింది. వాదనల అనంతరం విచారణ వాయిదా వేసింది. తదుపరి విచారణ ఈ నెల 30న ఉంటుందని పేర్కొంది. కాగా, ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం విజయపాల్ సుప్రీంకోర్టు వరకు వెళ్లడం తెలిసిందే. అయితే అత్యున్నత న్యాయస్థానంలో సైతం ఆయనకు నిరాశే ఎదురైంది. ఆయన పిటిషన్ ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. అనంతరం ఆయనను అరెస్ట్ చేశారు. రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసును ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ నేతృత్వంలో దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక

శనివారం 28 డిసెంబర్ 2024

# సైబర్ క్రైమ్, మహిళలపై జరిగే నేరాలపై అవగాహన కార్యక్రమం

**-త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ సూర్య మౌళి.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 27:
నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు నంద్యాల డిఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచనలతో నంద్యాల 3 టౌన్ ఇన్స్పెక్టర్ సూర్యమౌళి గారి ఆధ్వర్యంలో గవర్నమెంట్ జూనియర్ కళాశాల నందు ప్రస్తుతం సమాజంలో జరిగే సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన కల్పించడంతోపాటు మహిళలపై జరిగే నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏదైనా అనుకోని సంఘటన జరిగిన వెంటనే 100,112 నంబర్లకు గాని ఫోన్ చేసి పోలీసు వారి సహాయాన్ని కోరడం వలన తక్షణం పోలీస్ వారు స్పందించి మీకు రక్షణ కల్పిస్తారని తెలియజేశారు.
ఎవరైనా సైబర్ క్రైమ్ నేరగాళ్ల వలలో పడి మోసపోతే వెంటనే 1930 నెంబర్ కు గాని www.cybercrime.gov.in అనే వెబ్ సైటు లో గాని లేదా మీ దగ్గరలోని పోలీస్ స్టేషన్ ను సంప్రదించి సహాయం పొందాలని ఇన్స్పెక్టర్ సూర్యమౌళి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ తో పాటు ఎస్సై దేవేంద్ర కుమార్, గవర్నమెంట్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణపై యువతకు కౌన్సిలింగ్



ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా డిసెంబర్ 27:
నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు డోన్ డిఎస్పి శ్రీనివాస్ సూచనలతో రోడ్డు ప్రమాదాల చర్యలలో భాగంగా డోన్ రూరల్ ఇన్స్పెక్టర్ రాకేష్ ఆధ్వర్యంలో విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం వలన కలుగు ప్రయోజనాల గురించి వివరించి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లేనియెడల చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం ఇతర వాహనాల పత్రాలు మరియు డ్రైవింగ్ చేసేటప్పుడు ముందు జాగ్రత్త చర్యలకు సంబంధించి కౌన్సెలింగ్ నిర్వహించారు.

# మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ముగ్గురికి జైలు శిక్ష




ఆంధ్ర ప్రగతి నంద్యాల క్రైమ్ డిసెంబర్ 27:
1.వడ్ల రాజశేఖర్ ,వయస్సు 22, సన్నాఫ్ వి. క్రిష్ణ ,బైటిపేట, నంద్యాల టౌన్ 2.చాకలి మధురాజు వయస్సు 24 సన్నాఫ్ సి. ఓబులేసు ఆర్ఎస్ రంగాపురం (గ్రామం),బేతంచెర్ల (మండలం) 3.పెద్ద మాతంగి లక్ష్మయ్య వయస్సు 22 S/o పి ఎం చిన్న సాయిబాబా,హరిజనవాడ, నంద్యాల టౌన్,పైన కనపరిచిన ముగ్గురు వ్యక్తులు 26.12.2024 వ తేది నంద్యాల మండలం లోని నందమూరి నగర్ వద్ద రోడ్డు పైన వచ్చి పోయే ఆడవారికి సైగలు చేస్తూ వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వుండగా వారిని నంద్యాల తాలూకా పోలీస్ వారు అదుపులోకి తీసుకొని వారిపై పెట్టి కేస్ No.1118 to1120/2024 యు/సి 296 బి ఎన్ ఎస్ మేరకు కేసు నమోదు చేసి గౌరవ స్పెషల్ జె యం ఎస్సి నంద్యాల వారి ముందర హాజరు పరచగా గౌరవ జడ్జి 30 రోజుల సాధారణ జైలు శిక్ష విధించినందున ముగ్గురిని సబ్ జైలు నందు వదలడమైనది.

# మహానంది లో పిఎంజి పూజలు



ఆంధ్ర ప్రగతి మహానంది డిసెంబర్ 27:మహానంది మహానందీశ్వర స్వామి సన్నిధిలో కర్నూలు రీజనల్ పోస్టుమాస్టర్ జనరల్ ఉపేంద్ర పూజలు నిర్వహించారు. శుక్రవారం స్వామివారి దర్శనానికి వచ్చిన ఆయన కు ఆలయ ముఖమండపం వద్ద టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు,స్వాగతం పలికారు. అనంతరం శ్రీకాశమేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామివార్ల కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆనవాయితీ ప్రకారం కళ్యాణ మండపంలో వేదపండితులు నాగేశ్వర శర్మ, హనుమంతు శర్మల వేదాశీర్వచనం తో దుషాలువ కప్పి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఆయన వెంట ఏ ఎస్పీలు సత్యనారాయణ, పార్వతి, పోస్టల్ శాఖ ఉద్యోగులు వెంకటేశ్వర రెడ్డి, తదితరులు ఉన్నారు.

# ఈవియం గోడౌన్లను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్

ఆంధ్ర ప్రగతి నంద్యాల, డిసెంబర్ 27:
భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోడౌన్లను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పర్యవేక్షించారు. శుక్రవారం టేక్కె మార్కెట్ యార్డ్ లోని ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్లను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతి నిధుల సమక్షంలో కలెక్టర్ పరిశీలించారు.
ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతి నిధుల సమక్షంలో గోడౌన్లకు వేసిన సీల్లను ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిష్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు.



ఈవీఎంల గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పలు సూచనలు జారీ చేశారు. డిఆర్ఓ రామునాయక్, ఆర్డీఓ విశ్వనాధ్, ఎన్నికల విభాగపు తాసిల్దార్ జయప్రసాద్, గుర్తింపు పొందిన



రాజకీయ పార్టీ ప్రతినిధులైన కాంగ్రెస్ తరపున సయ్యద్ రియాజ్ బాషా, వైయస్సార్సీపి తరపున సాయిరాం రెడ్డి, టిడిపి తరపున శివరామిరెడ్డి, సిపిఎం తరపున నరసింహులు, బిజెపి తరపున కసెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అటవీ సంరక్షణ అందరి బాధ్యత.!

**-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల,డిసెంబర్ 27:
అటవీ సంపదను సంరక్షించుకుంటూ వన్యప్రాణులను కాపాడుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పచ్చర్ల ఎకో టూరిజమ్ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అధి రాజ్ సింగ్ రాణాతో కలిసి జిల్లా అటవీ సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, నంద్యాల, ఆత్మకూరు అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్లు నాగమనేశ్వరి, సాయిబాబా, అనురాగ్ మీనా, అబ్దుల్ రవూఫ్, అటవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ అటవీ సంరక్షణలో భాగంగా అటవీ సంపద ఉత్పత్తులను కాపాడుకుంటూ వన్యప్రాణులను కూడా సంరక్షించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బనగానపల్లి రేంజ్ లోని మంగంపేట తండాలోని ఫారెస్ట్ భూములను పేద ప్రజలకు డి-పట్టాలు ఇవ్వడంపై ఫారెస్ట్ అధికారులు అభ్యంతరాలు తెలపడంతో రెవెన్యూ అధికారులతో పర్యవేక్షించి తగు పరిష్కార చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. బండి ఆత్మకూరు రేంజ్ పరిధిలోని అడవులకు ఆనుకొని ఉన్న గ్రామాల్లో అటవీ ప్రదేశంలోనికి ప్రవేశించకుండా రెవెన్యూ, ఫారెస్ట్ భూ వివాదాల పరిష్కారానికి జాయింట్ సర్వే నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని జెసి, ఫారెస్ట్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. బండి ఆత్మకూరు మండలంలోని ఓంకారేశ్వర దేవాలయం సిబ్బంది అటవీ ప్రదేశాలలో చెట్లను నరికివేయడమే కాకుండా అనేక చెత్తపదార్థాలను అటవీ ప్రాంతంలో వేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఆలయ అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు. నల్లమల అటవీ ప్రాంతంలోని పెచ్చేరువు గూడెంకు సంబంధించిన గిరిజనులకు 2020 సంవత్సరంలో డి.పట్టాలిచ్చినప్పటికీ సాగు చేసుకునేందుకు అటవీ అధికారులు అనుమతులు ఇవ్వాలని ఆత్మకూరు డిఎఫ్ఓ ను కలెక్టర్ ఆదేశించారు. అలాగే గిరిజనలు సాగు చేసుకుంటున్న భూముల్లో బోర్లు వేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని అటవీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



అటవీ భూములతో పాటు, వన్య ప్రాణులను కాపాడుకోవడం మనందరి భాధ్యతని అటవీ సంపద స్మగ్లింగ్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అధి రాజ్ సింగ్ రాణా అన్నారు. ఇందుకు పోలీసు, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# నేరాల కట్టడికి పట్టణ శివారు ప్రాంతాలపై డ్రోన్ కెమెరాలతో నిఘా

**-నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్మానుష్యమైన ప్రదేశాల్లో డ్రోన్లు నిఘా.**

**-జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల క్రైమ్ డిసెంబర్ 27:
నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు నంద్యాల జిల్లాలో ప్రతి సబ్ డివిజన్ నందు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో గల నేరం జరిగే ప్రదేశాలపై నిరంతరం నిఘా ఏర్పాటు చేసి నేరాలకు అడ్డుకట్టు వేస్తున్న జిల్లా పోలీసులు. ఈ సందర్భంగా నంద్యాల తాలూకా, జూపాడు బంగ్లా, డోన్ టౌన్ మరియు ఆళ్లగడ్డ టౌన్ పోలీస్ స్టేషన్ ల పరిధిలో నిర్మానుష్యమైన ప్రదేశాల్లో డ్రోన్లు నిఘా ఏర్పాటుచేసి, అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డు కట్టు వేసేందుకు డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టి గంజాయి వినియోగం, పేకాట శిబిరాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం ,న్యూసెన్స్ సృష్టించిన వారిపై నిఘా ఉంచి కేసులు నమోదు చేయడం జరుగుతుంది. కళాశాలలో, పాఠశాల పరిసర ప్రాంతాలలో



ఈవిటిజింగ్, చైన్ స్నాచింగ్ వంటి నేరాలు అరికట్టేందుకు ప్రత్యేక చర్యలను డ్రోన్ లతో చేపడుతున్నారు. కావున ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

# ఖిద్మత్ సొసైటి ఆధ్వర్యంలో వడ్డీరహిత ఋణాలు పంపిణి

## -నంద్యాల ఖిద్మత్ సేవలు అమోఘం.

**-ఖిద్మత్ సొసైటిలో సభ్యులుగా చేరి మీ వ్యాపారాలు అభివృద్ధి చేసుకోండి. -ఎన్ఎండి ఫిరోజ్.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 27:
నంద్యాల ఖిద్మత్ సొసైటి సేవలు విస్తరిస్తూ తనదైన శైలిలో ముందుకు పోతుందని. వడ్డీ రహిత ఋణాలు ఇచ్చి చిరు వ్యాపారులకు అండగా నిలుస్తుందని, ఈ నేపథ్యంలో ఈ రోజు సొసైటి ద్వారా ఇరవై లక్షల ఋణాలు నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మైనార్టీ యువనాయకులు ఎన్.ఎండి ఫిరోజ్ ముఖ్య అతిథిగా పాల్గొని పంపిణి చేసారు.
ఈ సంధర్భంగా సొసైటి జిల్లా డైరెక్టర్ అబ్దుల్ సమద్ మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం ఇరవై మంది సభ్యులతో ప్రారంభమైన "ఖిద్మత్ మ్యూచవల్ ఎయుడెడ్ కో ఆపరేట్ త్రిఫ్ట్ క్రెడిట్ సొసైటి" ఎపి.మాక్స్ 1995 ద్వారా రిజిస్టర్ అయి నేడు 1400 వందల పై బడి సభ్యులతో 1400మందికి వడ్డీ రహిత ఋణాలు ఇచ్చి 60 కోట్ల టర్నోవర్ తో పేదల ఆర్థిక పరిపుష్టికి శ్రమిస్తుందన్నారు .ముఖ్య అతిథి ఎన్ఎండి



ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాల ఖిద్మత్ సొసైటి సేవలు అమోఘంగా ఉన్నాయని పేద చిన్న వ్యాపారులకు చాలా ఉపయుక్తంగా ఉన్నాయి. చిన్న చిన్న పైకానికి లక్షలు వడ్డి చెల్లించి జీవితాలు చిన్నాభిన్నం చేసుకుంటున్నారు, దోపిడికి గురి అవుతున్నారు , అలాంటి వారు ఖిద్మత్ సొసైటి లో తప్పక చేరాలన్నారు. నంద్యాల ఖిద్మత్ కు తన సపోర్ట్ సంపూర్ణంగా ఉంటుందన్నారు. సోసైటి అధ్యక్ష కార్యదర్శులు ముహమ్మద్ యూసుఫ్, అబ్దుల్ నబి




(అబ్దుల్లాహ్), సభ్యులు నవాజ్ ఖాన్,ఆసిఫ్, సయ్యద్ జమీలుద్దీన్, అబ్దుల్ అలీం, సీ.యం.జకరియా, మేనేజర్ జి.ఇలియాస్, పెన్నాల ముహమ్మద్ షఫి, అలీ, రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

# విపత్తు నివారణకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోండి

**-జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**




ఆంధ్ర ప్రగతి నంద్యాల, డిసెంబర్ 27:
ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు విపత్తు నివారణకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకునేందుకు సంబంధిత శాఖలు నివేదికలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో డిజాస్టర్ మేనేజ్మెంట్ ముందస్తు జాగ్రత్త చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీఓలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, భారీ వర్షాలు, వరదలు తదితర విపత్తుల నుండి సంరక్షించుకునేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ప్రణాళికలు సిద్ధం చేసుకోవడంతో పాటు సంబంధిత నివేదికలు ఇవ్వాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల జిల్లాలోని వాగులు ఉప్పొంగడం వల్ల గ్రామాల మధ్య రహదారుల రాకపోకలు నిలిచిపోయాయన్నారు. జిల్లాలో 21 వాగులు 54 గ్రామాల రహదారులకు అనుసంధానమై ఉన్నాయని వాటి పటిష్టతకు చర్యలు తీసుకోవాలని అన్నారు. నంద్యాల పట్టణానికి అనుకొని ఉన్న కుందునదిలో కుందేరు, బుగ్గవంక, పాలేరు, గాలేరు, మద్దిలేరు, సప్పిటి వాగులు కలవడం, వాగుల చుట్టూ ఉన్న స్థలాలు ఆక్రమణలకు గురికావడం వల్ల భారీ వర్షాలు కురిసినా, వరదలు వచ్చినా నంద్యాల పట్టణం ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. వీటి నియంత్రణకు ఆక్రమణలు అరికట్టడంతో పాటు ప్రమాదాల నివారణ చర్లపై దృష్టి సారించాలన్నారు. సాగునీటి కాలువలు, వాగుల బండ్ పటిష్టతపై ఇరిగేషన్ అధికారులు నివేదికలు ఇవ్వాలన్నారు. అటవీ ప్రాంతాల నుండి వచ్చే వాగులు, సామర్థ్యానికి మించి సాగునీటి కాలువలు, వాగులు, వంకల ప్రవాహాల వల్ల ప్రమాదానికి గురయ్యే గ్రామాలను గుర్తించి తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు, ఇందుకు అనుగుణంగా కావలసిన మెటీరియల్ పై నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఆత్మకూరు డివిజన్లో ఇటీవల కురిసిన వర్షాలకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే పంట పొలాలు దెబ్బతిన్నాయన్నారు. అలాగే శ్రీశైలం వెళ్లే దారిలో కొండ చర్యలు విరిగిపడి ట్రాఫిక్ కు కూడ అంతరాయం ఏర్పడిందన్నారు. పోతిరెడ్డిపాడు, బానకచర్ల, సిద్దాపురం మైనర్ ఇరిగేషన్ ట్యాంకులకు గండ్లు పడకుండా ఇరిగేషన్ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలనీ ఇరిగేషన్, ఆత్మకూరు ఆర్డీవోను కలెక్టర్ ఆదేశించారు. నంద్యాల పట్టణంలో అధిక వర్షాలకు రెండు కాలనీలు నీటిమయం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ రహదారులకు మధ్యలో ఉన్న వాగులపై ఆర్ అండ్ బి సంబంధించి 57, పంచాయతీరాజ్ సంబంధించి 30 కాజ్ వే లు వున్నాయని వాటిని పరిశీలించి పటిష్టతకు చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైన బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలు ఇవ్వాలని కలెక్టర్ ఆర్ అండ్ బి, పంచాయతీ అధికారులను ఆదేశించారు. అవుకు రిజర్వాయర్ నుండి నీటి ప్రవాహం వెళ్లే గొల్లలేరు వాగుపై ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని డోన్ ఆర్డీవోను కలెక్టర్ ఆదేశించారు. వేసవిలో తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవడంతో బోర్ల ఫ్లషింగ్, డీపనింగ్ బోర్ వెల్స్ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 27,230 మట్టి మిద్దలు ఉన్నాయని భారీ వర్షాల సమయంలో సంబంధిత కుటుంబాల వ్యక్తులను అప్రమత్తం చేయాలన్నారు. ప్రధానంగా భారీ వర్షాలు, వరదలు, కరువు తదితర కారణాల వల్లనే విపత్తులు సంభవిస్తాయని వీటికి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.




## వ్యవసాయ నైపుణ్య సామర్థ్య పెంపు శిక్షణ కార్యక్రమం.

ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 27: నంద్యాల జిల్లా వనరుల కేంద్రం ఉప వ్యవసాయ సంచాలకులు శ్రీమతి సరళమ్మ నంద్యాల వారి ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ వై.వి. మురళీకృష్ణ అధ్యక్షతన నంద్యాల జిల్లాలోని క్షేత్ర సాయి సిబ్బందికి అనగా వి ఏ ఏ/విహెచ్ఎ లు మరియు అన్ని మండలముల వ్యవసాయ అధికారులకు నైపుణ్య సామర్థ్య పెంపు శిక్షణ కార్యక్రమము నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వై.వి. మురళీకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అమలు పరుస్తున్న వివిధ పథకాలను వివరించి పథకాలన్నీ క్షేత్ర సాయి సిబ్బంది రైతులకు చేరవేయాలని అదేవిధంగా రైతులు సాగు చేస్తున్న పంటలకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు తెలియజేసి నాణ్యమైన అధిక దిగుబడి సాధించుటకు కృషి చేయాలని తెలిపారు. అదేవిధంగా రైతులకు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త శ్రీమతి చైతన్య వివిధ పంటలలో తెగుళ్లను గుర్తింతుట మరియు వాటి నివారణకు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలు గురించి తెలియచేసారు. మరియు ప్రొద్దుతిరుగుడు పంట యాజమాన్య పద్ధతులు వివరించడం జరిగినది. అలాగే వ్యవసాయశాఖ ద్వారా అమలుపరుస్తున్న వివిధ పథకాల గురించి రైతూసేవ సిబ్బంది ద్వారా చర్చాఘోష్ఠి నిర్వహించటం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు చెన్నయ వివిధ సబ్ డివిజన్ ల సహాయ వ్యవసాయ సంచాలకులు రాజశేఖర్, ఆంజనేయులు, విజయ శేఖర్ , రామ్మోహన్ రెడ్డి, సుధకర్ జిల్లాలోని వివిధ మండలాల వ్యవసాయ మరియు జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారులు పాల్గొనడం జరిగింది.

# రాధామనోహర్ దాసుకు హైందవ పాంచజన్యము బిరుదముతో ఘన సన్మానం.




ఆంధ్ర ప్రగతి పత్తికొండ డిసెంబర్ 27:
ఇస్కాన్ ధర్మ ప్రచారకులు రాధామనోహరదాసును పూజ్యశ్రీ అనంత చారిటబుల్ ట్రస్ట్, ఆధ్వర్యంలో హైందవ పాంచజన్యము బిరుదముతో ఘన సన్మానం చేశారు. ధర్మవ్యాప్తి కోసం వ్యక్తిగత సుఖ సంతోషాలను వదిలి జీవితాన్ని సమాజ సేవకు అంకితం చేసిన మహానుభావుడు రాధా మనోహర్ దాస్ అని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత రాధామనోహర్ దాస్ మాట్లాడుతూ ఇంతటి అభిమానులను సంపాదించుకున్నందుకు నా జన్మ ధన్యమయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పూజ్యశ్రీ అనంత చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అనంత అనిల్ కుమార్, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి, రాష్ట్ర విశేష సంపర్కప్రముఖ్, జిల్లా ఉపాధ్యక్షులు న్యాయకంటి భీమిరెడ్డి, గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజు గుప్త, ఆవోప చీఫ్ మలిపెద్ది నాగేశ్వరరావు , నిమ్మయ్యదాస్, రామలింగయ్య, వీరరాజు, రాజేశ్ నాయుడు, అర్చక పరిషత్ రాష్ట్ర నాయకులు యం.కె.నాగరాజు స్వామి, గోవర్ధన్ నాయుడు, వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులతో పాటు పెద్ద సంఖ్యలో ధార్మిక సమాజాలు పాల్గొన్నాయి.

## ఆర్థిక సంస్కర్త కన్నుమూత
# బాల అకాడమీ విద్యా సంస్థ ఘన నివాళి



ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 27: అవిశ్రాంత యోధుడు ఆర్థిక సంస్కరణల రూపశిల్పి నిరాడంబరుడు మాజీ భారత ప్రధాని మన్మోహన్ సింగ్ 92 సంవత్సరాల వ యస్సులో అస్వస్థతకు గురై కన్ను మూశారు. పేరులోనే కాక వ్యక్తిత్వం లోను మనోహరాన్ని నిలుపుకున్న మన ప్రియతమ నేత ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్. ఘననివాళి అర్పించే సందర్భంగా బాల అకాడమీ విద్యా సంస్థలో సంతాప సభ నిర్వహించడం జరిగిందిఈ సంతాపసభలో బాల అకాడమీ విద్యా సంస్థ కరస్పాండెంట్ రవీంద్రనాథ్ ప్రిన్సిపల్ మాధవీలత పాల్గొని మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలు, ఆయన జీవితం, వ్యక్తిత్వం మనందరికి ఆదర్శం అని విద్యార్థులకు తెలియజేశారు. ఈ సంతాప సభలో బాల అకాడమీ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పించారు.

# విజయోత్సవాలలో భాగంగా నందమూరి నగర్ లో పతావిష్కరణ




ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 27: భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాల లో భాగంగా నందమూరి నగర్ లో సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ పతావిష్కరణ గావించడం జరిగింది. నందమూరి నగర్ సిపిఐ శాఖ కార్యదర్శి ఎస్ హుస్సేన్ సా అధ్యక్షతన జరిగిన జెండావిష్కరణ కార్యక్రమానికి సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ హాజరై మాట్లాడుతూ.. నాడు స్వాతంత్రం కొరకు పోరాడుతూ బ్రిటిష్ వారి చేతిలో మనవారు పడుచున్న మారణకాండకు,హింసకు బానిసత్వానికి. అణచివేత ధోరణికి అత్యాచారానికి హత్యలకు ఎదురు నిలిచేందుకు ఒక ఎర్ర జెండా ఉండాలని సిపిఐ ని 1925 డిసెంబర్ 26న ఆ మహానుభావులు స్థాపించి నేటికీ 100 సంవత్సరముల లోకి అడుగు వేసింది.
భూమి కోసం భుక్తి కోసం పేద ప్రజల సంక్షేమం కోసం పోరాటాలు నిర్వహిస్తున్న సిపిఐ ని నాటి యోధులను తలుస్తూ దేశవ్యాప్తంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాల విజయోత్సవాలను సిపిఐ శ్రేణులు ఘనంగా జరుపుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ పతావిష్కరణ కార్యక్రమంలో నందమూరి నగర్ సిపిఐ నాయకులు మా భాష ఇస్మాయిల్ నాయక్ రహిమాన్ ఆనంద్ ఖలీల్ మధు నారాయణ భాష రాము హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని డాక్టర్ మన్ మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు..

**-మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి.**





ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 27:
భారత మాజీ ప్రధాని గొప్ప ఆర్థిక సంస్కరణ వేత డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరనిలోటని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి గృహంలో దివంగత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతికి సంతాపంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి వారు చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే శిల్పారవి చంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ... భారతదేశ మాజీ ప్రధాని డాక్టర్ మనో మన్మోహన్ సింగ్ ఆర్థిక సంస్కరణ వేత్తగా ప్రధానిగా అనేక గొప్ప సంస్కరణలను చేపట్టి అవనికపై భారతదేశ చిత్రపటాన్ని అభివృద్ధి చెందుతున్న ప్రపంచ దేశాల వరుసలో నిలువ పెబెట్టాడని భారతదేశానికి కీర్తి ప్రతిష్టలను తీసుకువచ్చాడని కొనియాడారు. భారత దేశంలో విదేశీ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం, వీరు చేపట్టిన అనేక ఆర్థిక సంస్కరణలని, అంతేకాక భారతదేశాన్ని సూపర్ పవర్ దేశంగా అభివృద్ధి చెందేందుకు డాక్టర్ మన్మోహన్ సింగ్ కృషి ఎంతైనా ఉందని తెలిపారు. దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు హయాంలో కేంద్ర ఆర్థిక మంత్రిగా వారు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు భారత్ ను అగ్రగామి దేశాల్లో ఒకటిగా నిలబెట్టాయనుటలో ఎటువంటి అతిశయోక్తి లేదన్నారు. డా. మన్మోహన్ సింగ్ అధికారంలో ఉన్న 10 సంవత్సరాల కాలంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని, ప్రధానంగా ఉపాధి హామీ పథకం ద్వారా నిరుపేదలకు జీవనభృతి కల్పించారని తెలిపారు. ఇలా అనేక గొప్ప కార్యక్రమాలను చేపట్టిన మాజీ ప్రధాని ఆర్థికవేత్త డాక్టర్ మోహన్ సింగ్ మృతి దేశానికి తీరనిలోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి పి మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ విజయ శేఖర్ రెడ్డి, దేశం సుధాకర్ రెడ్డి, దాల్మిల్ అమీర్, కౌన్సిలర్ చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ ,కిరణ్ కుమార్ ,టివి రమణ, శంకర్ నాయక్, రాజా,నాగరాజు, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చక్రం తిప్పుతున్న వీఆర్వోలు..!!

**-ఆఫర్ చేస్తేనే ఆన్లైన్.**
**-అధికారుల చుట్టూ రైతులు**



ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల డిసెంబర్ 27:
రెవెన్యూ కార్యాలయంలో కొందరు వీఆర్వోలు చక్రం తిప్పుతుండడంతో రైతులు వారి చుట్టూ ప్రదర్శనలు చేస్తున్నారు. పాత వెబ్ ల్యాండ్ లో ఉన్న భూమి , కొత్త వెబ్ లో లేకపోవడంతో ఉన్న భూమి రికార్డుల్లో లేకుండా పోతుందని రైతులు కొందరు వీఆర్వోల చుట్టూ తిరిగి చమట కార్చుకుంటున్నారు.
శిరివెళ్ల మండలంలోని కొన్ని గ్రామాలు ఉండగా వాటిలో కొన్ని గ్రామాలకు మాత్రమే రీ సర్వే జరిగింది. వీటిలో కొన్ని గ్రామాలకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వగా, మరికొన్ని గ్రామాలకు ఇవ్వలేదు. జరిగిన కొన్ని గ్రామాలలో కూడా అవకతవకతలు జరగాయని ఆరోపణలు రావడం వల్ల వాటి విషయం మీద అడగగా వారికి పుస్తకాల పంపిణీ నిలుపుదల చేశారు. మళ్లీ రీ సర్వే జరపాలని రైతులు డిమాండ్ చేశారు. చాలా గ్రామాల్లో రైతులకు ఉన్న భూమి కంటే తక్కువ భూమి 1బిలో ఉండడంతో లబోదిబోమంటూ వీఆర్వోల చుట్టూ తిరిగి తమ భూమి యధావిధిగా ఉండేటట్లు చేయాలని కోరి వారికి తాంబూలాలు సమర్పిస్తున్నారు. ఆఫర్ లేనిదే ఆన్లైన్ చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. పాత పాసు పుస్తకాల్లో భూమి యధావిధిగా ఉన్న ఆన్లైన్లో తక్కువ ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు కావాలని రైతులకు ఉన్న భూమిని తగ్గించి పక్కవారిలో కలపడంతో ఎక్కువ భూమి ఉన్న రైతు అధికారుల చుట్టూ తిరుగుతూ టెన్షన్ పడుతున్నారు.
రీ సర్వే జరిపి సర్వేరు ,వీఆర్వోలు కొలతలు వేసిన యదార్థంగా వారికి ఉన్న భూమిని రికార్డులను నమోదు చేయించుకోవడానికి అధికారుల చుట్టూ తిరిగి తిరిగి ఇక ఓపిక లేక తాంబూలం సమర్పించుకొని పనులు చేయించుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రి సర్వే జరిపి రైతులు ఇబ్బంది పడకుండా వారి రికార్డు నమోదు చేయాలని కనీసం 1బి అప్డేట్ చేయాలని ఆదేశించిన చాలా గ్రామాల్లో ఆదేశాలు సైతం లెక్కచేయకుండా రెవెన్యూ కోసం పనిచేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో ఉన్న కొందరు కాసులకు కక్కుర్తి పడడంతో భూమి రికార్డులు కాకి రెక్కలలా ఉంటున్నాయని అంటున్నారు. ఇప్పటికైనా రైతులు ఇబ్బంది పడకుండా వారికి ఉన్న భూమి మేరకు రికార్డు నమోదు చేయాలని పలువురు కోరుతున్నారు. తహసిల్దార్ వివరణ వీటిపై సిరివెళ్ల తాసిల్దార్ పుష్పకుమారి వివరణ కోరగా రైతులు ఎవరికీ డబ్బులు ఇవ్వవలసిన అవసరం లేదని గ్రామాల్లో ఉండే సచివాలయంలో వారు దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు. రైతులు సమస్యలు పరిష్కారం కోసమే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శనివారం 28 డిసెంబర్ 2024

# ఉర్దూ కవి మిర్జా గాలిబ్ జయంతి “గాలిబ్ డే”

## విద్యార్థుల కవి సమ్మేళనం.





ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ డిసెంబర్ 27: నంద్యాల జిల్లా ప్రముఖ ఉర్దూ సాహిత్య కమిటీ కార్వానే ఉర్దూ ఆధ్వర్యంలో నంద్యాల మండలం అయ్యలూరు గ్రామంలో గల ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సి అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన ప్రముఖ ఉర్దూ కవి ఉర్దూ సాహిత్య రంగంలో ఉర్దూ గజల్ రా రాజుగా పేరు ప్రఖ్యాతలు గాంచిన మిర్జా అసదుల్లా బేగ్ ఖాన్ గాలిబ్ జయంతి పురస్కరించుకొని విద్యార్థుల కవి సమ్మేళనం అలరించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జోయా ఉర్దూ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ సి అబ్దుల్ సత్తార్, ఉర్దూ సాహిత్య కమిటీ కార్వనే ఉర్దూ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ సమద్ పాల్గొన్నారు. ఈ సందర్భముగా ముఖ్య అతిధుల అబ్దుల్ సత్తార్, అబ్దుల్ సమదచ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఉర్దూ సాహిత్యం తో దూరం అవుతున్న తరుణంలో విద్యార్థులలో ఉర్దూ సాహిత్యం పై దృష్టి సారించి ఉర్దూ కవితల నైపుణ్యం పెంపొందుకు, ఉర్దూ భాష ప్రముఖలను విద్యార్థులకు పరిచయం చేస్తూ, విద్యార్థులకు గుణాత్మక విద్య అందిస్తూ,ఉర్దూ భాష అభివృద్ధికి పాటుపడుతున్న ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ అజీజ్ ఉపాధ్యాయులను అభినందించారు . పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లం గాలిబ్ చిన్నతనం నుండే ఉర్దూ కవితలు అల్లే వాడిని, అసలు ఉర్దూ కవితలలో “గజల్” కు సొగసులు తొడిగి గజల్ రారాజుగా నిలిచారన్నారు. గాలిబ్ జీవితం పై సినిమా, సీరియళ్ళు రావటం ఆయన సాహిత్య విలువలు నిదర్శనం అన్నారు. గాలిబ్అసలు పేరు మిర్జా అసదుల్లా ఖాన్, కలం పేరు గాలిబ్, అసద్. ఉర్దుతో పాటు ఫార్సి రచనలలో పేరు ప్రాఖ్యాతులు పొంది నేటికీ ఉర్దూ ప్రపంచంలో రారాజుగా చలామణి అవడం, నేడు ఆయన 227 జయంతి జరుపుకోవడం ఉర్దూ సాహిత్య ప్రేమికులకు ఆయన పై ఉన్న గౌరవానికి నిదర్శనం అన్నారు. గాలిబ్ వేషధారణలో విద్యార్థి, గాలిబ్ కవితలతో విద్యార్థులు అయన జ్ఞాపకాలు సజీవం చేసారు. తదనంతరము ఆరు ఏడు ఎనిమిదో తరగతి విద్యార్థులు గాలిబు రాసిన కవితలను, గాలిబ్ కవి సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులను ముఖ్య అతిథుల చేతులమీదుగా ప్రశంస పత్రాలు బహుమతులు అందజేశారు. తదనంతరం ముఖ్య అతిథులుగా వచ్చిన సి అబ్దుల్ సత్తార్,అబ్దుల్ సమద్ ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సి అబ్దుల్ అజీజ్ ఉపాధ్యాయులు, అఖిలాభాను నాసిర,హజీరా, ఘనంగా సన్మానించారు...మాజి ప్రధాని డా.మన్మోహన్ సింగ మృతి పట్ల తీవ్ర సంతాపం తెలిపిన కార్వానే ఉర్దూ,మాజి ప్రధాని డా.మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఉర్దూ సాహిత్య కమిటి కార్వానే ఉర్దూ సంస్థ తీవ్ర సంతాపం జరిగింది. వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ సమద్, కన్వీనర్ సి.అబ్దుల్ అజిజ్ మాజి ప్రధానికి నివాళి అర్పిస్తూ దేశం గొప్ప ఆర్థిక వేత్తలు కోల్పోయిందని, దేశ ఆర్థిక మంత్రిగా, ప్రధాన మంత్రిగా శ్రీ సింగ్ సేవలు దేశం మరిచిపోదని ఆయన అభివృద్ధి పథకాలు దేశాన్ని ఉన్నత స్థాయికి చేర్చారని ఘనంగా ఆయన సేవలు స్మరించారు.

# మాజీ ప్రధాని కి ఘనంగా నివాళులు అర్పించిన ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక

### -ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు అకుమాళ్ళ రహీమ్.

ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 27:




దివంగ నేత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ గొప్ప ఆర్థిక సంస్కర్త ,దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టీ దేశాభివృద్ధికి పాటుపడిన గొప్ప ఆర్థిక సంస్కర్త,మరియు గొప్ప గొప్ప మంచి చట్టాలు ను తీసుకొచ్చిన ఘనత కూడా ఆయనదే. సమాచార హక్కు చట్టం 2005 , గ్రామీణ ఉపాధి హామీ పతకము,మరియు ఆహార భద్రత చట్టం వంటి చట్టాలు రావడానికి కారకులు అనికొనియాడారు. నిజాయతీ ,ఏటువంటి విమర్శలకు తావు లేకుండా నిరాడంబరుడు అని కొనియాడారు. ఎలాంటి నాయకులు ను భవిషత్తు తరం నాయకులు ఆదర్శంగా తీసుకొని దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు దోహద పడాలని కోరారు. జిల్లా కార్యదర్శి మోహన్ బాబు మాట్లాడుతూ దేశం ఒక గొప్ప నాయకుణ్ణి కోల్పోయాం దేశానికి ఇది తీరని లోటు రాజకీయ జీవిత ప్రారంభ ములో ఏవిధముగా ఉన్నారో చనిపోయేవరకు కూడా అదే నిరాడంబర జీవితాన్ని గడిపిన గొప్ప నాయకుడు అని కొనియాడారు. నంద్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి శివ శంకర్ మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో ఇలాంటి నిజాయతీ నాయకులు చాలా అరుదుగా ఉన్నారని కావున భవిషత్తు తరం నాయకులు వీరిని ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధికి చిత్తశుద్ధితో పాటుపడాలి అని తెలిపారు. ఈ కార్యమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సత్య నారాయణ,జిల్లా కోశాధికారి రహంతుల్లా,,నంద్యాల జిల్లా కార్యదర్శి మోహన్ బాబు,నంద్యాల మండల ప్రధాన కార్యదర్శి చాబోలి శివ నారాయణ,పట్టణ కార్యదర్శి శివ శంకర్,చిన్న వ్యాపారుల సంక్షేమ సంఘం నంద్యాల పట్టణ అధ్యక్షులు ఆటోనగర్ వాసు, ఉపాధ్యక్షులు చంద్ర పాల్,సంజీవరాజు, కార్యదర్శి తిరుమలే శు ఐక్య వేదిక సభ్యులు నాగేశ్వర్ రావు,అన్వర్,అల్ మద దు కంప్యూటర్ సెంటర్ ఫ్యాకల్టీ అబ్దుల్ మజీద్ ,తదితరులు పాల్గొన్నారు.

# వైయస్సార్ నగర్ లో అభివృద్ధి పనులను పర్యవేక్షించిన ఎన్ఎండి ఫిరోజ్

ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 27: నంద్యాల పట్టణ శివారులోని 38వ వార్డు వైఎస్సార్ నగర్ నందు జరుగుతున్న , జరగబోయే అభివృద్ధి పనులను నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ వెళ్లి దగ్గరుండి పర్యవేక్షించడం జరిగింది అనంతరం అక్కడున్నటువంటి ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు వాటిని పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు.



ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే అభివృద్ధి పనులను శరవేగంగా చేస్తున్నామన్నారు . ఎలక్షన్ టైం లో ఏవైతే హామీలు ఇచ్చామో వాటన్నిటిని కచ్చితంగా పరిష్కరిస్తామన్నారు . అనంతరం అక్కడ 15 లక్షల 60 వేలతో జరుగుతున్న డ్రైనేజీ పనులను , 31 లక్షలతో జరగబోయే రోడ్డు పనులను , కరుణామయ స్కూల్ రోడ్డుకు 10 లక్షలు , కచ్చా కాలువలకు 1 లక్ష 82 వేల రూపాయల శాంక్షన్ కావడం జరిగిందని వీటన్నిటినీ త్వరలోనే ప్రారంభించి ప్రజలకు మంచి చేస్తామని తెలియజేశారు. అలాగే మిగిలిన రోడ్లు కాలువలు కూడా మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి వాటి కావాల్సిన ఫండ్ ను కూడా రిలీజ్ చేయించుకుని వాటిని కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు . తెలుగుదేశం ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అని ప్రజల సమస్యను పరిష్కరించడానికి ముందుండే ప్రభుత్వమని తెలిపారు .. ఈ కార్యక్రమంలో దేరెడ్డి శివనాగిరెడ్డి , తాటికొండ బుగ్గరాముడు , మరాఠీ సూరి , మల్లె పోగు సురేష్ (మేషేక్) , కల్కి రాఘవేంద్ర , కసిరెడ్డి ప్రసాద్ రెడ్డి , కోటేశ్వరుడు , శంకర్ , దేను నాయక్ , సత్యరాజ్ , నందం బాబురావు , గుండుపాపుల ఖలీల్ , మీసాల లక్ష్మయ్య , పాస్టర్ సురేష్ , పాస్టర్ ఏసుపాదం , దేరెడ్డి పరమేశ్వర్ రెడ్డి , సీడ్ కంపెనీ సురేష్ , పాస్టర్ ఓబన్న , ఇస్మాయిల్ సుధాకర్ , బాషా తదితరులు పాల్గొన్నారు.




# ఇండియన్ రెడ్ క్రాస్, రోటరీ ఇన్నర్ వీల్ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై విద్యార్థులకు అవగాహన

ఆంధ్రప్రగతి నంద్యాల డిసెంబర్ 27

నంద్యాల - నంద్యాల జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్, రోటరీ ఇన్నర్ వీల్ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆనంద్ కుమార్ హాజరయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే అందించవలసిన ప్రథమ చికిత్స గురించి వారు విద్యార్థులకు




వివరించారు. కొంతమంది విద్యార్థులచే ప్రాక్టికల్ గా ప్రథమ చికిత్స ఎలా చేయాలో విద్యార్థులచే చేయించామని నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల తెలిపారు. కార్యక్రమంలో రోటరీ ఇన్నర్ వీల్ అధ్యక్షురాలు విజయ కుమారి, సభ్యులు వసుంధర దేవి, విజయలక్ష్మి, రేణుక, మల్లేశ్వరి, మున్సిపల్ హై స్కూల్ అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భారతీయ సంస్కృతిని కాపాడుకుందాం



ఆంధ్ర ప్రగతి పత్తికొండ డిసెంబర్ 27: భారతదేశానికి తరతరాల నుండి వస్తున్న ఆచార పరంపరల వల్లనే ప్రపంచంలో భారతదేశానికి విశిష్టమైన స్థానం లభించిందని, మన ఉనికికి కారణమైనటువంటి సంస్కృతిని కాపాడుకోవలసిన బాధ్యత ఈ దేశ పౌరులందరిపై ఉన్నదని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో పత్తికొండ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా వారు ప్రసంగించారు. ప్రముఖ రంగస్థల కళాకారుడు పాయసం పెద్ద రంగారెడ్డి చేసిన సంగీతోపన్యాసం భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం అధ్యక్షులు అమరావతి శ్రీనివాస్, తితిదే ధర్మ ప్రచార మండలి సభ్యులు న్యాయకంటి భీమిరెడ్డి, విశ్వహిందూ పరిషత్ ప్రఖండ ప్రముఖ్ వీరరాజు, ఆర్ ఎస్ ఎస్ నాయకులు రామలింగయ్య, విశ్వహిందూ పరిషత్ మాతృమండలి జిల్లా ఉపాధ్యక్షులు రాధారెడ్డి, దుర్గావాహిణి ప్రముఖ్ ఆర్. అరుణా, గో రక్షక్ భీమ లింగారెడ్డి, శ్రీవారి సేవకులు ఆర్.సోమిరెడ్డి, లలితమ్మ, లక్ష్మీ , అనుపమ, విజయలక్ష్మి, ఎన్. సుభ నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



# ఐ.ఎం.ఎ. జాతీయ పురస్కారాలు అందుకున్న డాక్టర్ మధుసూదన రావు, డాక్టర్ రవి కృష్ణ..!

### -హైదరాబాద్ లో 99 వ ఐ.ఎం.ఎ.జాతీయ మహా సభలలో ప్రదానం.

### -డాక్టర్ మధుసూదన రావు కు జీవిత కాల సాధన పురస్కారం.

### -డాక్టర్ రవి కృష్ణ కు జ్యోతి ప్రసాద్ గంగూలీ సామాజిక సేవా పురస్కారం.





ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 27: హైదరాబాద్ లో శుక్రవారం మొదలైన భారతీయ వైద్య సంఘం 99 వ జాతీయ మహాసభలలో ప్రదానం చేసిన జాతీయ పురస్కారాల లో భాగంగా నంద్యాల ప్రముఖ వైద్యులు ఐ.ఎం.ఎ. రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ చేసిన మూడు దశాబ్దాల సామాజిక సేవలకు డాక్టర్ జ్యోతి ప్రసాద్ గంగూలీ స్మారక జాతీయ పురస్కారం అందుకోగా, నంద్యాల ప్రముఖ చెవి ముక్కు గొంతు నిపుణులు డాక్టర్ మధుసూదన రావు మూడు దశాబ్దాలుగా చేసిన వైద్య సేవలకు గుర్తింపుగా ఐ.ఎం.ఎ. జాతీయ జీవిత కాల సాధన పురస్కారం అందుకున్నారు. ఐ.ఎం.ఎ. జాతీయ అధ్యక్షులు డాక్టర్ అశోకన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, నూతన అధ్యక్షులు డాక్టర్ దిలీప్ బన్సాలి ఈ పురస్కారాలు అందించి ఘనంగా సత్కరించి అభినందించారు. నంద్యాల వైద్యులు జాతీయ పురస్కారాలు అందుకున్న సందర్భంగా రాష్ట్ర ఐ.ఎం.ఎ. అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ నంద కిషోర్, డాక్టర్ బోస్, రాష్ట్ర కార్యవర్గం, నంద్యాల వైద్యులు హర్షం వ్యక్తం చేశారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మేగా రక్తదాన శిబిరం



ఆంధ్ర ప్రగతి కొలిమిగుండ్ల డిసెంబర్ 27: నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం, రెడ్ క్రాస్ సొసైటీ మరియు గ్రామీణ వైద్యుల సంఘం మరియు అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో మెగా రక్తదానం నిర్వహించబడినది ముఖ్య అతిధులుగా కొలిమిగుండ్ల సీఐ రమేష్ బాబు, లక్ష్మి రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, పుచ్చ వెంకట మల్లారెడ్డి ,సర్పంచ్ శివ శంకర్ గ్రామీణ యువకులు అజయ్ సింహ రెడ్డి, గోనసాని మహేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ రక్త దానం చేయుటకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగరాజు గ్రామీణ వైదులు చింతరాయలపల్లి హుస్సేన్ వలి, చంద్ర మోహన్ గౌడ్ సర్ మరియు గురు మోహన్ మరియు సుబ్బరాయుడు గురు స్వామి చింతలయలపల్లి దస్తగిరి,శివ ల ఆధ్వర్యంలోఈ బ్లడ్ క్యాంపు కనకద్రిపల్లి అయ్యప స్వామి గుడి ఆవరణం లో నిర్వహించబడినది. కర్నూల్ రెడ్ క్రాస్ సంస్థ సేకరించబడిన రక్తం ఆక్సిడెంట్ అయిన వారికి మరియు గర్భవతులకు మరియు ఏ ఇతర అత్యవసర పరిస్థితులలో వినిగించుకొనుటకు ఉపయోగపడును ప్రతి ఒక రక్తదాత ఇచ్చిన రక్తం ఇంకోక ప్రాణం కాపాడబడును ఈ రక్త దానం మేము అనగా గ్రామీణ వైదులం ప్రతి సంవసరం 13 సంవస్తరం నుంచి కొనసాగించబడుతుంది. రక్త దానం చేసిన దాతలకు ధన్యవాదములు తెలుపుతున్నాము

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# విద్యుత్ చార్జీల పెనుభారాన్ని తగ్గించండి..

## సృష్టించిన సంపద ఎవరి జోబుల్లోకి పోయిందో చెప్పండి..!

### -మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష.

-6నెలల్లో ప్రజలపై 1585కోట్ల విద్యుత్ భారం.

-విద్యుత్ చార్జీల పెనుబారాన్ని తగ్గించేంత వరకు పోరాటాలు ఆగవు.

-మోసపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి ప్రజల నడ్డివిరుస్తున్న కూటమి ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెప్పండి.

-సృష్టించిన సంపద ఎక్కడికి పోయింది.. ఎవరి జేబుల్లోకి వెళ్లింది

-ప్రజల పక్షాన పోరాటాలు చేస్తాం.. వెన్నంటి ఉంటాం.





ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 27:
రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కేవలం 6నెలల వ్యవధిలోనే రెండు సార్లు విద్యుత్ చార్జీలను పెంచి రాష్ట్ర ప్రజలపై కరెంటు చార్జీల బాదుడును పెంచిందని, పెంచిన కరెంట్ చార్జీలను కూటమి ప్రభుత్వం వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ నంద్యాల నియోజకవర్గంలో శుక్రవారం వైఎస్సార్సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యర్తలు, విద్యుత్ వినియోగదారులు పెద్ద ఎత్తున నంద్యాల పట్టణం సాయిబాబ నగర్ ఆర్చ్ నుండి ర్యాలీగా తరలి వచ్చి విద్యుత్ శాఖ కార్యాలయంలో ఎస్ఈ సుధాకర్ కుమార్ కు పెంచిన చార్జీలను తగ్గించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అలాగే స్థానికంగా పెండింగ్లో ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మీడియాతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ.... కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రజల వద్దకు వెళ్లి విద్యుత్ చార్జీలను పెంచమని మోసపు వాగ్దానాలను గుప్పించారని విమర్శించారు. అయితే ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతూ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్న 6నెలల కాలంలో రెండుసార్లు విద్యుత్ చార్జీలను పెంచి రాష్ట్ర ప్రజలపై దాదాపుగా 15485కోట్ల అదనపు భారాన్ని మోపడం దారుణం అన్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ చార్జీల బాదుడుపై పోరాటానికి సిద్ధం అయ్యామన్నారు. విద్యుత్ చార్జీలను పెంచి ప్రజల నడ్డివిరుస్తున్నారని తెలిపారు. ఎన్నికల సందర్భంగా చంద్రబాబునాయుడు అనేక సభల్లో జగన్మోహన్ రెడ్డి బాదుడే బాదుడని వెటకారంగా మాట్లాడటాన్ని ప్రజలు గమనించారని, అయితే నేడు చంద్రబాబు పెంచిన విద్యుత్ చార్జీలు బాదుడే బాదుడు కాదా అని సూటిగా ప్రశ్నిస్తున్నామని ఎద్దేవాచేశారు. కరెంటు చార్జీలు పెంచనే పెంచం సంపద సృష్టిస్తాం.. ఆ డబ్బుతో కరెంటు బిల్లుల భారాన్ని తగ్గిస్తామని చెప్పిన మాటలు ఎక్కడికి పోయాయో చెప్పాలన్నారు. సంపద సృష్టి స్థామన్న టీడీపీ నాయకులంతా సంపద సృష్టించుకుంటున్నారని, రాష్ట్ర ప్రజలకు సంపద సృష్టిస్థానరని ప్రజలు నమ్మి ఓట్లు వేసి మోసపోయారని, అలాగే సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా నీకు 15వేలు, నీకు 15వేలు, నీకు 18వేలు, నీకు 18వేలు అంటూ చెప్పిన పథకాలు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే నాడు చంద్రబాబు నాయుడు వాటిని పగులగొట్టండని పిలుపు నిచ్చారని, నేడేమో స్మార్ట్ మీటర్లను బిగించుకోండని చెప్పడం ఎంతో విడ్డూరంగా ఉందన్నారు. 200 యూనిట్లు ఉచితంగా పేదలకు ఇస్తామని చెప్పి విద్యుత్ బిల్లులను వసూలు చేస్తున్నారని గుర్తుకు చేశారు. ప్రజలకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంపద సృష్టిస్తున్న సంపద ఎక్కడికి పోతున్నది, ఎవరి జేబుల్లోకి పోతున్నదో చెప్పాలన్నారు. రైతన్నలకు గిట్టుబాటుధరను కల్పించండని రైతన్నలు రోడ్డునెక్కారని, టీడీపీ కూటమి ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. పెన్షన్ల పరిశీలన పేరుతో అనేక పెన్షన్లను తొలగించే ప్రక్రియను చేపడుతున్నారని ఇది సరికాదన్నారు. డైవర్షన్ రాజకీయాలను చేస్తూ ప్రజలను ప్రక్కదారి పట్టించేందుకు టీడీపీ చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని, టీడీపీ మోసపు మాటలను నమ్మరని, ప్రజలు కూటమి ప్రభుత్వ విధానాలను తిరస్కరిస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఇసాక్ బాష మాట్లాడుతూ... అపద్దపు వాగ్దానాలతో ప్రజలు మోసపోయారని, కనువిప్పుకలిగిందన్నారు. తమ్ముల్లూ విద్యుత్ చార్జీలు పెంచమని అనేక సభల్లో చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలు ఎక్కడికి పోయాయని ఎద్దేవా చేశారు. ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తామని చెప్పి ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. ప్రజల పక్షాన పోరాటాలు చేసేందుకు, ప్రజలతో వెన్నంటి ఉంటామని, పెంచి విద్యుత్ చార్జీలను తగ్గించేవరకు తమ పోరాటాలు ఆగవన్నారు. ఈ కార్యక్రమంలో పి పి మధుసూదన్ రెడ్డి వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్ , వైఎస్ఆర్సిపి కౌన్సిలర్స్ కోఆప్షన్ సభ్యులు వార్డు ఇన్చార్జిలు సర్పంచులు ఎంపీటీసీలు వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## వైసిపికి మరో నేత రాజీనామా

### రాజకీయాల నుంచి తప్పకున్న మాజీ ఐఎఎస్ ఇంతియాజ్



కర్నూలు,డిసెంబర్27ఆంధ్ర ప్రగతి :
ఏపీలో అధికారం కోల్పోయిన తర్వాత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి వరుసగా షాక్లు తగులుతూ వస్తున్నాయి.. ఇప్పటికే సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు.. ప్రజాప్రతినిధులు ఇలా ఎంతో మంది పార్టీని వీడారు.. కూటమి పార్టీలో చేరుతున్నారు.. అయితే, తాజాగా వైసీపీ మరో షాక్ తగిలినట్టు అయ్యింది.. మాజీ ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ వైసీపీకి రాజీనామా చేశారు.. అలాగే మొత్తం రాజకీయాలకే గుడ్‌బై చెప్పాలని నిర్ణయించుకున్నట్టు ప్రకటించారు.. గత ఎన్నికల్లో కర్నూల్ జిల్లా నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఇంతియాజ్.. ఓటమి పాలయ్యారు.. అయితే, ఇప్పుడు ఇంతియాజ్ రాజీనామా లేఖ విడుదల చేశారు.. రాజకీయాలకు గుడ్ బై చెప్పాలని నిర్ణయం తీసుకున్నానని పేర్కొన్నారు.. కొన్ని నెలల క్రితం ప్రజాసేవే ధ్యేయంగా, ముఖ్యంగా కర్నూలు నగరంలో ఉన్న పేదలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఐఏఎస్ సర్వీస్ నుండి వీఆర్ఎస్ తీసుకొని రాజకీయాల్లోకి రావడం జరిగింది. కర్నూలు నియోజకవర్గం నుంచి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడం, ఎన్నికల ఫలితాలు మీ అందరికీ తెలిసిందే.. గత కొంత కాలంగా బంధుమిత్రులు మరియు శ్రేయోభిలాషులతో చర్చించ ఒక నిర్ణయానికి రావడం జరిగింది.. అదేమిటంటే.. రాజకీయ రంగం నుడి దూరంగా జరగటం.. రాజకీయాలకు దూరం అవుతున్నాను.. కానీ ప్రజసేవ రంగానికి కాదు‘ అని పేర్కొన్నారు..ఇక, ‘ఇప్పుడు ఒక రిటైర్డ్ ఏఐఎస్ అధికారిగా, సామాజిక స్పృహ కలిగిన వ్యక్తిగా మరియు సాహితీవేత్తగా ఒక మెరుగైన సమాజం కోసం, నా వంతు కృషి చేయటానికి సిద్ధంగా ఉన్నాను.. గత ఆరు నెలల కాలంలో నాకు సహకారం అందించిన ప్రతి ఒక్కరికి.. ముఖ్యంగా కర్నూలు నగర వాసులకు మనస్పూర్తిగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.. రాబోయే రోజుల్లో సామాజిక అసమానతలను, రుగ్మతులను రూపుమాసేందుకు, పర్యావరణ కాలుష్యం తగ్గించేందుకు ఆ దిశగా పని చేసే స్వచ్ఛంద సంస్థలతో, వ్యక్తులతో పని చేయాలని ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది..‘ అంటూ ఆ లేఖలో ఇంతియాజ్ పేర్కొన్నారు..

## మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు

### -కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య.





ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 27:
భారత మాజీ ప్రధాని గొప్ప ఆర్దిక సంస్కరణ వేత డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరనిలోటని నంద్యాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోదివంగత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతికి సంతాపంగా కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి వారు చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ సందర్భముగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య మాట్లాడుతూ భారతదేశ మాజీ ప్రధాని డాక్టర్ మనో మన్మోహన్ సింగ్ ఆర్థిక సంస్కరణ వేత్తగా ప్రధానిగా అనేక గొప్ప సంస్కరణలను చేపట్టి అవనికపై భారతదేశ చిత్రపటాన్ని అభివృద్ధి చెందుతున్న ప్రపంచ దేశాల వరుసలో నిలువ పెబెట్టాడని భారతదేశానికి కీర్తి ప్రతిష్టలను తీసుకువచ్చాడని కొనియాడారు. భారత దేశంలో విదేశీ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం, వీరు చేపట్టిన అనేక ఆర్థిక సంస్కరణలని, అంతేకాక భారతదేశాన్ని సూపర్ పవర్ దేశంగా అభివృద్ధి చెందేందుకు డాక్టర్ మన్మోహన్ సింగ్ కృషి ఎంతైనా ఉందని తెలిపారు. దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు హయాంలో కేంద్ర ఆర్థిక మంత్రిగా వారు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు భారత్ ను అగ్రగామి దేశాల్లో ఒకటిగా నిలబెట్టాయనుటలో ఎటువంటి అతిశయోక్తి లేదన్నారు. డా. మన్మోహన్ సింగ్ అధికారంలో ఉన్న 10 సంవత్సరాల కాలంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని, ప్రధానంగా ఉపాధి హామీ పథకం ద్వారా నిరుపేదలకు జీవనభృతి కల్పించారని తెలిపారు. ఇలా అనేక గొప్ప కార్యక్రమాలను చేపట్టిన మాజీ ప్రధాని ఆర్థికవేత్త డాక్టర్ మోహన్ సింగ్ మృతి దేశానికి తీరనిలోటని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీఅధికార ప్రతినిధి ఊ కొట్టు వాసు కాంగ్రెస్ పార్టీ నాయకులు చాబోలు సలాం. ఆనందరావు.అబ్రహం. చెన్నారెడ్డి.వెంకటేస్. రెహిమాను హమీద్ బాలకృష్ణ మా భాష నరసింహులు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మన్మోహన్ గొప్ప ఆర్థిక వేత్త

### ఆయన మరణం తీరని లోటు: జగన్



పులివెందులడిసెంబర్27ఆంధ్ర ప్రగతి :
మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు అని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఆయన మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం పులివెందులలోని తన నివాసంలో జగన్ మాట్లాడుతూ పదేళ్లపాటు దేశ ప్రధానిగా మన్మోహన్ సింగ్ గొప్ప సేవలందించారని ప్రశంసించారు. ఆయన మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆర్బీఐ గవర్నర్ గా, ఆర్థిక మంత్రిగా ఆర్థిక సంస్కరణల తో దేశ పురోభివఅద్ధికి ఎంతగానో కృషిచేశారన్నారు. రాజ్యసభ సభ్యుడిగా, వాణిజ్య మంత్రిత్వ శాఖ సలహాదారుగా, ఆర్థికశాఖ ప్రధాన సలహాదారుగా, ఆర్థిక మంత్రిత్వశాఖ కార్యదర్శిగా, ప్రణాళిక సంఘం చైర్మన్ గా, ప్రధాని సలహాదారుగా, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిటీ చైర్మన్ గా ఇలా ఎన్నో బాధ్యతలు నిర్వహించిన మన్మోహన్ సింగ్ గొప్ప మేధావి అని కొనియాడారు. ఏ బాధ్యత నిర్వహించినా ప్రతి చోటా తనదైన ముద్ర కనబరిచారని గుర్తు చేశారు. ఆయన దార్శనికత ఎప్పటికీ ఆదర్శప్రాయమని అన్నారు. మన్మోహన్ సింగ్ మృతితో దేశం ఒక మహా నాయకుడిని కోల్పోయిందని చెప్పారు.

## ఫలించిన తెలంగాణ నేతల ఒత్తిడి

### సిఫార్స్ లేఖలు ఆమోదస్తామన్న టిటిడి

### వారంలో రెండురోజులు మాత్రమేనంటూ మెలిక



తిరుమల, డిసెంబర్27ఆంధ్ర ప్రగతి :
తెలంగాణలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు శుభవార్త చెప్పింది. వారానికి రెండు సార్లు తెలంగాణ నేతల సిఫార్సు లేఖలు అనుమతించాలని నిర్ణయం తీసుకుంది. శ్రీవారి దర్శనానికి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు తీసుకోవడం లేదనే ప్రశ్నపై టీటీడీ ఈవో శ్యామల రావు గతంలో స్పందించారు. శ్రీవారి దర్శనానికి ఆంధప్రదేశ్ నుంచి వచ్చిన సిఫారసు లేఖలు మాత్రమే అనుమతిస్తున్నామని స్పష్టత ఇచ్చారు. తెలంగాణ నుంచి సిఫార్సు లేఖలు తీసుకువస్తే.. చెల్లుబాటు కావని స్పష్టమైంది. దీంతో తెలంగాణ ప్రజాప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవస్థానంలో తెలంగాణ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులను చిన్న చూపు చూస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి పలు ఘటనలు వరుసగా వెలుగులోకి వచ్చాయి.దీంతో తాజాగా టీటీడీ బోర్డు తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖల అంశాన్ని పునఃపరిశీలించింది. మిత్ర, సాటి తెలుగు రాష్ట్రంపై ఇలాంటి నిర్ణయం సరికాదనుకుంది. బోర్డులోని మెజారిటీ సభ్యులు కూడా సిఫారసు లేఖలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. దీంతో బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. ఇక తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలు వారానికి రెండు సార్లు అనుమతిస్తారు.

# పివి దార్శనికతకు ప్రతిరూపం మన్మోహన్ సింగ్ !

న్యూఢిల్లీ,డిసెంబర్27ఆంధ్ర ప్రగతి : పివి ప్రధాని కాకుండా ఉండివుంటే భారతదేశ గతి మరోలా ఉండేది. ఇప్పటిలా దేశం పరుగెత్తేది కాదేమో. ఆర్థిక సంస్కరణలతో దేశానికి పునాది వేసిన పివి...తన కార్యాచరణ కోసం నిపుణులైన వారిని ఆనాడు ఎంపిక చేసుకున్నారు. అలా ఎంపిక చేసుకున్న వారిలో అగ్రగణ్యులు మన్మోహన్ సింగ్. ఆర్థిక సంస్కరణ లకు బీజం వేయాలన్న లక్ష్యంతో పివి చాల లోతుగా ఆలోచించి నిర్ణయాలు తీసుకున్నారు. ఈ క్రమంలో ఆనాడు ప్రణబ్ ముఖర్జీ లాంటి వారిని కూడా కాదని ఆర్థిక శాఖను ఏరికోరి మన్మోహన్ సింగ్‌కు కట్టబెట్టారు. తన ప్రణాళిక మేరకు మన్మోహన్ మాత్రమే పనిచేయగల సమర్థుడని పివి నమ్మారు కాబట్టే ఆర్థిక సంస్కరణల రథం పరుగెత్తింది. ఆర్‌బిఐ గవర్నర్‌గా మాత్రమే..పెద్దగా ఎవ్వరికీ గుర్తింపులేని మన్మోహన్ ఆనాడు పివి కేబినేట్‌లో చేరడంతో ఆయన ప్రతిభ కూడా బయటపడింది. పివి ప్రధానిగా బాధ్యతలు చేపట్టే నాటికి దేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉంది. విదేశీ బ్యాంకుల్లో బంగారం కుదువబెట్టారు. నిరుద్యోగం తాండవిస్తోంది. ఇవన్నీ బాగా ఆకళింపుచేసుకున్న నేతగా పివి నరసిహారావు ముందుగా దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దాలన్న సంకల్పంతో తన కార్యాచరణను ప్రారంభించారు. అలా పివి తనకు చేదోడువాదోడుగా, రాజకీయ మకిలి అంటని మన్మోహన్‌ను ఎంచుకోవడం ఓ పెద్ద మైలురాయిగా చెప్పుకోవాలి. అలా పివి మార్గనిర్దేశనంలో మన్మోహన్ ఆర్థికమంత్రిగా తనవంతు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఆ సంస్కరణలే నేటికీ మనకు అన్నం పెడుతున్నాయి. పివి తీసుకుని వచ్చిన సంస్కరణలను ఆనాడు అంతా వ్యతిరేకించి నా.. ఇవాళ మనమంతా విదేశాల వైపు చూడగులుగుతున్నా..విదేశీ చదువులకు వెళుతున్నా, విదేశీ వస్తువులను కొనగలుగుతున్నా..అందుకు ఆనాటి సంస్కరణలే బీజం వేశాయి. అలా తొలిసారి మన్మోహన్ సింగ్ ఆర్థికమంత్రిగా 1991లో బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఆధునిక భారత్ వైపు అడుగులు వేయించిన 1991 బడ్జెట్‌పై మన్మోహన్ సింగ్‌కు సొంత పార్టీ నుంచి కూడా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ముఖ్యంగా ఎరువులు, పెట్రోల్, ఎల్‌పీజీ ధరలను పెంచడం చాలామంది ఎంపీలకు మింగుడు పడలేదు. కానీ, మన్మోహన్  మాత్రం ఆ వ్యతిరేకతను చాలా సున్నితంగా స్వీకరించారు. ఇదంతా ఆనాటి ప్రధానిగా పివి అంతరంగం నుంచి వచ్చిన నిర్ణయం. అందుకే నాటి ప్రధాని పీవీ నరసింహారావు కూడా సభ్యులను ఒప్పించే భారం మన్మోహన్ పై వేసి మౌనంగా ఉండిపోయారు. ఈనేపథ్యంలో మన్మోహన్ తోటి సభ్యులను ఒప్పించి.. మెప్పించి ముందడుగు వేశారు. ప్రధానిగా పీవీ నరసింహారావు బాధ్యతలు చేపట్టగానే.. ఆర్థికమంత్రిగా మన్మోహన్ సింగ్‌ను ఎంపిక చేశారు. ఈ నిర్ణయం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఎట్టకేలకు ఆయన 1991 జులై 24న గతంలో ఎప్పుడూ చూడని, భారత్ తలెత్తుకుని ముందుకు సాగేలా బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. తన బడ్జెట్‌లోని వివిధ అంశాలను మన్మోహన్ ఆనాడు మీడియాకు స్పష్టంగా వివరించారు. దానిని 'బ్జడెట్ విత్ హ్యూమన్ ఫేస్'గా అభివర్ణించారు. తీవ్ర విమర్శల మధ్య కూడా ఎరువులు, పెట్రోల్, ఎల్‌పీజీ ధరల పెంపును సమర్థించారు. మరోవైపు సొంత పార్టీ నేతల్లో వచ్చిన అసంతృప్తిని నాటి ప్రధాని నరసింహారావు గమనించి.. ఆగస్టు1న కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ మీటింగ్ ఏర్పాటుచేశారు. ఎంపీలు తమ ఆగ్రహం, అసంతృప్తిని బహిరంగంగా వెళ్లగక్కేందుకు అవకాశం ఇచ్చారు. వాటిని మన్మోహన్ నేరుగా ఎదుర్కొని సమాధానం చెప్పేలా నరసింహారావు మౌనంగా ఉన్నారు. ఈ సమావేశం 2, 3 తేదీల్లో ఇది సుదీర్ఘంగా కొనసాగింది. వాటిల్లో కూడా ప్రధాని పాల్గొన్నారు. ఈసందర్భంగా మన్మోహన్‌కు కేవలం మణిశంకర్ అయ్యర్, నాథూరామ్ మిర్ధా నుంచి మాత్రమే మద్దతు లభించింది. ఇది రాజీవ్‌గాంధీ ఆకాంక్షలకు తగినట్లు ఉందని నాడు అయ్యర్ వర్ణించారు. సభ్యులను శాంతపర్చేందుకు నాడు మన్మోహన్ ఎరువుల ధరల్లో స్వల్ప తగ్గింపును చేశారు. ఎల్‌పీజీ, పెట్రోల్ ధరల్లో మాత్రం రాజీ పడలేదు. మొత్తం మీద అన్ని పక్షాలను శాంతపరుస్తూనే.. ఎరువుల ధరలపై నియంత్రణ తొలగింపును కొనసాగించ గలిగారు. వాస్తవానికి బడ్జెట్ ప్రవేశపెట్టాల్సిన జులై నాటికి భారత విదేశీ మారకద్రవ్యం పూర్తిగా అడుగం టింది. దీంతో ఆ నెల ఆర్‌బీఐ తన వద్ద ఉన్న 41 టన్నుల బంగారాన్ని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ వద్ద కుదవపెట్టి విదేశీ మారక ద్రవ్యాన్ని తెచ్చుకొంది. ఆ సమయంలో విపక్షాలు ఆయన్ను 'మౌన ప్రధానమంత్రి' అంటూ విమర్శలు చేశాయి. ప్రధానంగా నేటి ప్రధాని మోడీ ఈ విషయంలో ఓ అడుగు ముందుకు వేసి మౌనముని అంటూ విమర్శించారు. ఆర్థిక దివాళ అంటూ విమర్శలు చేశారు. అయితే మన్మోహన్ పదేళ్ల కాలం నాటి ఆర్థిక వ్యవస్థకు, నేడు మోడీ అనుసరిస్తున్న ఆర్థిక వ్యవస్థ తీరును పరిశీలిస్తే మనమంతా ఎక్కడ ఉన్నామో గమనించవచ్చు. ధరల పెరుగుదల, జివిస్టీ పేరుతో పన్నుల భారం వంటివన్నీ చూస్తున్నాం. కానీ మన్మోహన్ కాలంలో జిడిపికి నేటి జిడిపికి తేడా గమనించవచ్చు. ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల, పెట్రో ధరల సవారీ, నిరుద్యోగం, డాలర్ మారకం రేటు అన్నీ గమనిస్తే..మన్మోహన్ ఆర్థిక విధానాలు ఎంత బాగున్నాయో అర్థం చేసుకోవచ్చు. కానీ వీటిని అర్థం చేసుకోని వారు ఇద్దరు మాత్రమే ఉన్నారు. వారిలో ఒకరు ప్రధాని మోడీ, రెండోవారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాత్రమే. కాంగ్రెస్‌లో ఉన్నా మన్మోహన్ ఏనాడూ ఆర్థిక విధానాల నుంచి పక్కకు తొంగిచూడలేదనడానికి ఇదే నిదర్శనం. పివి- మన్మోహన్ నిర్ణయాలను పరికిస్తే నేటి మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు దిగదుడుపే.





## మన్మోహన్ హయాంలో చారిత్రక నిర్ణయాలు

### సమాచారహక్కు చట్టం...ఉపాధి హామీ

### విశిష్ట గుర్తింపు కార్డు ఆధార్‌కు శ్రీకారం

:మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ భారత ఆర్థిక విధానాలపై చెరగని ముద్ర వేశారు. ఆర్థిక సంక్షోభం నుంచి భారత్‌ను గట్టెక్కించడమే కాకుండా, ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా దేశాన్ని నిలిపారు. ప్రధానిగా పదేళ్ల సేవలందించిన ఆయన దేశ చరిత్రలో ఎన్నో కఠినమైన నిర్ణయాలు తీసుకున్నారు. దేశాభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు. దేశానికి సరికొత్త దశ, దిశ చూపిన ప్రధానిగా చరిత్రలో నిలిచిపోయారు.2004 నుంచి 2014 వరకు భారత ప్రధానిగా సేవలందించిన మన్మోహన్ సింగ్ మొదటి పర్యాయంలోనే దేశంలో ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రతి సమాచారాన్ని తెలుసుకునే హక్కు సామాన్యులకు ఉండాలనే లక్ష్యంతో సమాచార హక్కు చట్టాన్ని తెచ్చారు. గ్రామీణ ప్రజలకు వ్యవసాయేతర ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో చారిత్రక ఉపాధి హామీ పథకానికి శ్రీకారం చుట్టారు. ప్రతి పౌరుడికి ఒక విశిష్ఠ గుర్తింపు సంఖ్య ఉండాలని ఆధార్ వ్యవస్థను తీసుకొచ్చారు. గ్రామీణ ప్రజల ఆరోగ్యం కోసం నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ చేపట్టారు. మన్మోహన్ సింగ్ పాలనాకాలంలోనే దేశంలో 3జీ, 4జీ సేవల ప్రారంభంతో మొబైల్ సాంకేతిక విప్లవం ఊపందుకుంది. ప్రైవేటు పాఠశాలల్లోనూ కొందరు పేద విద్యార్థులకు ఉచితంగా చదువుకునేలా నిబంధనలు రూపొందించింది. సామాన్యుడి చేతికి పాశుపత్రాస్త్రంలాంటి సమాచార హక్కును అందించింది. దేశంలో 3 కోట్ల మంది చిన్న, సన్నకారు రైతులకు రూ.72 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత మన్మోహన్ ప్రభుత్వానికే దక్కుతుంది. మన్మోహన్ ప్రభుత్వంలో దేశంలో జరిగిన మార్పులను గుర్తించిన ప్రజలు 2009లో మరోసారి యూపీఏ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారు. 2009 మే 22న మన్మోహన్ సింగ్ రెండోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. పైకి మృదుస్వభావిలా కనిపించినా దేశం కోసం తీసుకునే నిర్ణయాల్లో అత్యంత కఠినంగా వ్యవహరించారు. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పాటు, ఉపాధి హామీ పథకం ప్రారంభం వంటి ఎన్నో కీలక పరిణామాలు ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే చోటుచేసుకున్నాయి. 2008లో చారిత్రాత్మకమైన భారతదేశం-అమెరికా పౌర అణు ఒప్పందంపై సంతకం చేశారు. భారతదేశం ప్రపంచ అణు మార్కెట్లోకి ప్రవేశించడానికి, ఇంధన సంక్షోభాన్ని అధిగమించడానికి ఈ ఒప్పందం దోహదపడింది. యూపీఏ ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతిచ్చిన లెఫ్ట్ పార్టీలు ఈ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి. మద్దతు ఉపసంహరించుకున్నాయి. అయినా మన్మోహన్ సింగ్ ఎక్కడా వెనక్కి తగ్గలేదు. అవసరమైతే ప్రధాని పదవికి రాజీనామా చేసేందుకు కూడా సిద్ధమయ్యారు.

## ఆర్థిక విధానాలపై మన్మోహన్‌ది చెరగని ముద్ర

:భారత ఆర్థిక విధానాలపై మన్మోహన్ సింగ్ చెరగని ముద్ర వేశారు. ఆర్బీఐ గవర్నర్‌గా, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్‌గా, కేంద్ర ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా ఆయన తీసుకున్న నిర్ణయాలతో ఆధునిక ప్రపంచంలో భారత్‌ను ఒక బలమైన ఆర్థిక శక్తిగా నిలబడేలా చేశారు. సమయం వచ్చినప్పుడు ఏ శక్తీ ఆపలేదు. ప్రపంచంలో భారత్ కీలక ఆర్థిక శక్తిగా అవతరించడం అన్నది అలాంటి ఆలోచనే అని నేనీ సభకు చెప్పాలనుకుంటున్నా అంటూ 1991లో కేంద్ర ఆర్థిక మంత్రిగా తొలి బడ్జెట్ ప్రసంగంలో ఆయన చేసిన వ్యాఖ్యలు బాగా ప్రాచుర్యం పొందాయి. ఆర్థిక వ్యవస్థను సరళీకరించి భారతదేశం ప్రపంచంలోనే ఆర్థిక సూపర్ పవర్‌గా మారడానికి మార్గం సుగమం చేసిన మన్మోహన్ సింగ్ మన పీవీ నరసింహా రావు చెక్కిన శిల్పమే. విద్యావేత్తగా, ఆర్థికవేత్తగా మన్మోహన్ తనదైన ముద్ర వేశారు. ఆర్థిక రంగంలో ఆయన అనుభవం, జ్ఞానంతో ఎన్నో గొప్ప అవకాశాలు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి.

1991లో దేశం కఠినమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో ప్రధానిగా ఎన్నికైన పీవీ నరసింహారావు ఆర్బీఐ గవర్నర్‌గా ఉన్న మన్మోహన్ సింగ్‌కు అనూహ్యంగా తన క్యాబినెట్‌లో చోటు కల్పించి ఆర్థిక మంత్రిని చేశారు. దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేసే కీలక బాధ్యతను అప్పగించారు. ఈ సమయంలోనే దేశంలో ఆర్థిక సంస్కరణలకు, సరళతర విధానాలకు మన్మోహన్ సింగ్ శ్రీకారం చుట్టారు. దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశను చూపించారు. ఆర్థిక సంక్షోభం నుంచి భారత్‌ను గట్టెక్కించడమే కాకుండా, ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా దేశాన్ని నిలిపారు. 1992లో పీవీ, మన్మోహన్‌సింగ్ కలిసి ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలే ప్రపంచంలో మన దేశం తలెత్తుకుని నిలబడేలా చేశాయని ఆర్థిక రంగ నిపుణులు చెబుతుంటారు. 2004 నుంచి 2014 వరకు భారత ప్రధానిగా సేవలందించిన మన్మోహన్ సింగ్ దేశంలో ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చారు. పైకి మృదుస్వభావిలా కనిపించినా దేశం కోసం తీసుకునే నిర్ణయాల్లో అత్యంత కఠినంగా వ్యవహరించారు మన్మోహన్ సింగ్. 2008లో చారిత్రాత్మకమైన భారతదేశం-అమెరికా పౌర అణు ఒప్పందంపై సంతకం చేశారు మన్మోహన్ సింగ్. భారతదేశం ప్రపంచ అణు మార్కెట్లోకి ప్రవేశించడానికి, ఇంధన సంక్షోభాన్ని అధిగమించడానికి ఈ ఒప్పందం దోహదపడింది. యూపీఏ ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతిచ్చిన లెఫ్ట్ పార్టీలు ఈ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి. మద్దతు ఉపసంహరించుకున్నాయి. అయినా మన్మోహన్ సింగ్ వెనక్కి తగ్గలేదు. అవసరమైతే ప్రధాని పదవికి రాజీనామా చేసేందుకు కూడా సిద్ధమయ్యారు.



## మన్మోహన్‌తో విడదీయరాని బంధం

### ఇరుదేశాల బంధం బలోపేతం - అగ్రరాజ్యం అమెరికా నివాళి

ప్రముఖ ఆర్థికవేత్త, భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపట్ల అగ్రరాజ్యం అమెరికా సంతాపం వ్యక్తం చేసింది. యూఎస్-భారత్ వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతం చేయడంలో మన్మోహన్ సింగ్ గ్రేట్ ఛాంపియన్ అని కొనియాడింది. ఈ మేరకు యునైటెడ్ స్టేట్స్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ ఆంటోనీ బ్లింకెన్ ఒక ప్రకటన విడుదల చేశారు. గత రెండు దశాబ్దాలలో భారత్, అమెరికా మధ్య అధునాతన సంబంధానికి పునాది వేయడంలో డాక్టర్ సింగ్ సహకారాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. 'మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణించినందుకు భారతదేశ ప్రజలకు యునైటెడ్ స్టేట్స్ హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేస్తోంది. యూఎస్--భారత్ వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపర్చిన వారిలో మన్మోహన్ సింగ్ ఒకరు. భారత దేశ అభివృద్ధికి ఆయన గొప్ప పునాదులు వేశారు. యుఎస్-ఇండియా పౌర అణు సహకార ఒప్పందాన్ని ముందుకు తీసుకెళ్లడంలో మన్మోహన్ సింగ్ కీలకంగా వ్యవహరించారు. ఈ ఒప్పందం భారత్ అమెరికాల మధ్య బంధాన్ని మరింత దృఢంగా చేసింది. ఆర్థిక సంస్కరణలతో భారత వేగవంతమైన ఆర్థిక వృద్ధికి దోహదపడిన మన్మోహన్ సింగ్ ఎప్పటికి గుర్తు ఉండిపోతారు. ఇండియా, యునైటెడ్ స్టేట్స్ మధ్య సంబంధాలను బలోపేతం చేయడం కోసం కృషి చేసిన మన్మోహన్ సింగ్ అంకితభావాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటాం' అని పేర్కొన్నారు. సరికొత్త ఆర్థిక సంస్కరణలతో దేశానికి దిశ, దశ చూపిన ప్రధానిగా మన్మోహన్ సింగ్‌ను ఈ చరిత్ర ఎన్నటికీ గుర్తుంచుకుంటుంది. ఇక, ఆయన హయాంలో అమెరికాతో జరిగిన అణుఒప్పందం పెను సంచలనమే..! కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ సహా సొంత పార్టీ నుంచే తీవ్ర వ్యతిరేకత వచ్చినా దానిపై ఆయన (ఓజీనిపనీరజీని ఈాతినిణర) ధైర్యంగా ముందుకెళ్లారు. తన మైనార్టీ ప్రభుత్వానికి వామపక్షాలు మద్దతు ఉపసంహరించుకొని హెచ్చరికలు జారీ చేసినా వెరవకుండా 2008లో అగ్రరాజ్యంతో అణుఒప్పందం చేసుకున్నారు. అందుకేనేమో.. నాటి అమెరికా అధ్యక్షుడు ఒబామా కు ఈయనంటే ప్రత్యేక అభిమానం. ఈ ఒప్పందం కుదిరిన రెండేళ్ల తర్వాత కెనడాలోని టొరంటో వేదికగా జీ20 సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఒబామా మాట్లాడుతూ మన్మోహన్‌పై ప్రశంసలు కురిపించారు. 'ప్రధాని చెబితే ప్రజలు తప్పకుండా వింటారనే మాటను మీరు నిజం చేశారని ఈ వేదికపై నుంచి నేను బలంగా చెబుతున్నా' అని ప్రశంసించారు. ఆ తర్వాత తాను రాసిన 'ఎ ప్రామిస్డ్ ల్యాండ్' పుస్తకంలోనూ మన్మోహన్ గురించి ఒబామా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయన అసాధారణ ప్రతిభ కలిగిన నిజాయతీపరుడు అని అభివర్ణించారు. భారత ప్రజల శ్రేయస్సు, ఆర్థిక సంస్కరణల కోసం ఆయన నిబద్ధతతో పనిచేశారని ప్రశంసించారు. తన సంస్కరణ లతో ఎంతోమందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చారన్నారు. తెలివైన, ఆలోచనాత్మక మైన, కపటం లేని నిజాయతీతో కూడిన వ్యక్తిత్వం మన్మోహన్ సొంతమని కొనియాడారు. 1998లో భారత్ పోఖ్రాన్ 2 అణుపరీక్షలు నిర్వహించింది. దీనిపై అప్పట్లో అగ్రరాజ్యం ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ క్రమంలోనే అంతర్జాతీయ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ మనపై పాక్షిక ఆంక్షలు విధించింది. అయితే, అమెరికాతో మన్మోహన్ చేసుకున్న అణుఒప్పందం తర్వాత భారత్‌పై ఉన్న ఈ ఆంక్షలు తొలగిపోయాయి.






# మనం ఏదైనా చేయగలం : సమంత

కష్టతర సమయాల్లో ఎలా ఉండాలో కొంతమంది సెలబ్రిటీలను చూసి నేర్చుకోవచ్చు. అలాంటి వారి జాబితాలో టాప్‌లో ఉంటుంది చెన్నై సుందరి సమంత. సోషల్ మీడియాలో చురుకుగా ఉండే ఈ భామ ఎప్పటికప్పుడు ఏదో ఒక పోస్ట్‌తో ఫాలోవర్లు, అభిమానుల్లో జోష్ నింపుతూంటుంది. తాజాగా ఉదయాన్నే మోటివేషన్ క్లాసులు చెబుతోంది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన పోస్ట్ నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. మార్నింగ్ మోటివేషన్.. మనం చేయగలం సామ్ మీ కలలను ఫాలో అవండి.. వాటికి మార్గం తెలుసు.. కొటేషన్‌ను హైలెట్ చేస్తూ.. బహుశా చూస్తూ కూర్చోవడం మంచిది. లేదంటే కాసేపు వేచి ఉండవచ్చు. బిజీ ప్రపంచంలో మీకు కావలసిందల్లా సాధారణ జీవితం. ప్రణాళిక లేకపోవడమనేది కూడా ప్రణాళికలో భాగమే కావచ్చు.. చక్కర్లు కొట్టడానికి.. హ్యాపీ హాలీడేస్ అంటూ క్యాప్షన్ ఇచ్చింది. సమంత ఓ వైపు బెడ్‌పై దుప్పటి కప్పుకొని హాయిగా నిద్రపోతున్న స్టిల్.. మరోవైపు వర్కవుట్ స్టిల్‌ను షేర్ చేయగా.. ఇప్పుడీ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. గతేడాది శాకుంతలం, ఖుషి సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చింది సామ్. ఆ తర్వాత హిందీలో వరుణ్ ధవన్‌తో సిటడెల్ వెబ్‌సిరీస్‌లో నటించింది. ఈ ప్రాజెక్టు తర్వాత సామ్ నుంచి కొత్త సినిమా ప్రకటన రావాల్సి ఉంది.

# వీరమల్లులో పాటపాడిన పవన్



టాలీవుడ్ యాక్టర్ పవన్ కల్యాణ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ హరిహరవీరమల్లు. పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ఈ చిత్రానికి జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీలో ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీ రెండు పార్టులుగా రానుండగా.. హరిహరవీరమల్లు పార్ట్ 1 మార్చి 28న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. కాగా న్యూ ఇయర్ కానుకగా మేకర్స్ ఏదైనా అప్‌డేట్ అందిస్తారేమోనని చూస్తున్న అభిమానులు, మూవీ లవర్స్ కోసం అదిరిపోయే వార్త నెట్టింట వైరల్ అవుతోంది. హరిహరవీరమల్లు ఫస్ట్ సింగిల్‌ను జనవరి 1న మధ్యాహ్నం 12 గంటలకు లాంచ్ చేయబోతున్నారని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు ఈ పాటను పవన్ కల్యాణ్ పాడటం విశేషం. తెలుగుతోపాటు మిగిలిన భాషల్లో కూడా పవన్ కల్యాణ్ వాయిస్‌తో పాట ఉండబోతుందట. ఇప్పటికే పవన్ కల్యాణ్ పాడిన పాటలు సూపర్ హిట్‌గా నిలువడమే కాదు.. బాక్సాఫీస్ వద్ద సూపర్ హైప్ క్రియేట్ చేశాయి. మరి పీరియాడిక్ డ్రామాకు స్టార్ యాక్టర్ వాయిస్ ఎలాంటి బజ్ క్రియేట్ చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ మూవీలో బాలీవుడ్ నటుడు, దర్శక నిర్మాత అనుపమ్ ఖేర్, అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. క్లైమాక్స్‌లో వచ్చే రెడ్ డ్రెస్ ఫైట్‌ను 42 రోజులపాటు చిత్రీకరించినట్లు ఇప్పటికే వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. ఇక ఇంట్రో సాంగ్, టైగర్ ఫైట్, మహల్ యాక్షన్ పార్ట్, కుస్తీ ఫైట్ సీన్, చార్మినార్ యాక్షన్ సన్నివేశాలు, ప్రీ ఇంటర్వెల్, ఇంటర్వెల్ భారీ యాక్షన్ సీక్వెన్స్, క్లైమాక్స్ వార్ సీన్ అభిమానులకు గూస్ బంప్స్ తెప్పించబోతున్నాయట.



# మోక్షజ్ఞ రెండో మూవీ.. క్రేజీ అప్డేట్ ఇచ్చిన స్టార్ ప్రొడ్యూసర్

టాలీవుడ్ నటసింహం నందమూరి బాలకృష్ణ వారసుడు నందమూరి మోక్షజ్ఞ.. సినీ ఇండస్ట్రీలో ఎంట్రీ ఇస్తున్న విషయం తెలిసిందే. హనుమాన్ మూవీతో ఒక్కసారిగా లైమ్ లైట్ లోకి వచ్చిన డైరెక్టర్ ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తన డెబ్యూ మూవీ చేస్తున్నారు మోక్షు. ఇప్పటికే ఆయన బర్త్ డే సందర్భంగా అఫీషియల్ అనౌన్స్మెంట్ వచ్చేసింది. సెప్టెంబర్ లో మోక్షజ్ఞ ఫస్ట్ లుక్ ను రిలీజ్ చేయగా.. అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. భారతీయ పురాణ ఇతిహాసాల బ్యాక్ డ్రాప్ తో సినిమా ఉంటుందని ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతోంది. బాలయ్య కీలక పాత్ర పోషిస్తున్నారని తెలుస్తోంది. అయితే డిసెంబర్ 5వ తేదీన మోక్షు డెబ్యూ మూవీ పూజా కార్యక్రమాలు జరగాల్సి ఉన్నా.. అవ్వలేదు.ఆ సమయంలో పలు రూమర్లు చక్కర్లు కొట్టగా.. మోక్షజ్ఞకు హెల్త్ బాలేదని అందుకే పూజా కార్యక్రమాలు జరగలేదని బాలయ్య తెలిపారు. త్వరలోనే జరుగుతాయని చెప్పారు. అయితే మోక్షజ్ఞ రెండో మూవీ ఫిక్స్ అయిపోయినట్లు కొద్ది రోజులుగా జోరుగా ప్రచారం జరుగుతోంది. ఎలాంటి ప్రకటన రాకపోయినప్పటికే నిజమేనని నెటిజన్లు అంటున్నారు. రీసెంట్ గా లక్కీ భాస్కర్ తో సూపర్ హిట్ అందుకున్న వెంకీ అట్లూరి డైరెక్షన్ లో మోక్షజ్ఞ నటించనున్నారని తెలుస్తోంది. ఇప్పటికే స్టోరీ గురించి డిస్కషన్స్ జరిగిపోయాయని సమాచారం. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై నాగవంశీ.. వెంకీ అట్లూరి- మోక్షజ్ఞ సినిమాను గ్రాండ్ గా నిర్మించనున్నారని టాక్ వచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ విషయంపై నాగవంశీ రెస్పాండ్ అయ్యారు. వెంకీ అట్లూరిపై బాలకృష్ణకు గట్టి నమ్మకం ఉందని, అందుకే ఆ ప్రాజెక్ట్ ను ఓకే చేశారని తెలిపారు. లక్కీ భాస్కర్ స్పెషల్ స్క్రీనింగ్ చూస్తున్నప్పుడు, బాలయ్య వెంకీ అట్లూరితో మోక్షజ్ఞ చిత్రాన్ని ధృవీకరించారని తెలిపారు. డైరెక్టర్ పనితనాన్ని బాలకృష్ణ ప్రశంసించినట్లు తెలిపారు. వెంకీ టేకింగ్ పై తనకు ఎలాంటి డౌట్ లేదని బాలయ్య చెప్పినట్లు నాగవంశీ పేర్కొన్నారు. మోక్షు వివిధ జోనర్లలో చిత్రాలు చేయాలని ఆసక్తితో ఉన్నట్లు తెలిపారు. మొత్తానికి నాగవంశీనే మోక్షు రెండో సినిమాను నిర్మించనున్నట్లు క్లియర్ గా తెలుస్తోంది. అయితే ఇప్పుడు బాలయ్య డాకు మహారాజ్ ఆయన నిర్మాణంలోనే రెడీ అవుతున్న విషయం తెలిసిందే. దీంతో ఇప్పుడు తండ్రి.. తర్వాత కొడుకు అన్నమాట.



# మహిళలెవరూ సీఎం సమావేశానికి హాజరుకానవసరం లేదు : పూనమ్‌కౌర్

ఇండస్ట్రీలో ఉన్న సమస్యలపైనే కాకుండా సామాజిక అంశాలపై ఎప్పుటికపుడు గొంతు వినిపించే నటీమణుల్లో టాప్‌లో ఉంటుంది పూనమ్ కౌర్. సోషల్ మీడియాలో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందని తెలిసిందే. ఈ భామ ఎప్పుడు ఏదో ఒక కామెంట్ వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. మహిళలెవరూ సీఎం సమావేశానికి వెళ్లేంత ముఖ్యమేం కాదంటోంది పూనమ్ కౌర్. ఈ మేరకు పూనమ్ కౌర్ ఎక్స్‌లో ట్వీట్ చేసింది. సీఎంతో సమావేశానికి మహిళలెవరూ కూడా ముఖ్యమైన వ్యక్తులుగా పరిగణించబడలేదు. ఎందుకంటే మహిళలకు ఎలాంటి సమస్యలుండవు. వ్యాపార సంబంధ విషయాలు, హీరోకు సమస్యలు వచ్చినప్పుడు మాత్రం పరిశ్రమ నిలబడుతుంది. కానీ మహిళలెవరికీ సమస్య ఉండదు.. అంటూ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించింది పూనమ్ కౌర్. ఈ కామెంట్స్ సినీ ప్రముఖులతో భేటీను ఉద్దేశించి చేసినవేనంటూ పలువురు నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. మరి ఈ కామెంట్స్‌పై ఎవరెలా స్పందిస్తారనేది చూడాలి.

# రెండు పార్ట్‌లుగా విజయ్ దేవరకొండ గౌతమ్ తిన్ననూరి ప్రాజెక్టు




టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ, జెర్సీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి కాంబినేషన్ లో ఓ సినిమా రానున్న విషయం తెలిసిందే. 'వీడీ12' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్ రానుండగా విజయ్ దేవరకొండ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమా తెరకెక్కుతుంది. సితార ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. అయితే ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు నిర్మాత నాగవంశీ. ఆయన మాట్లాడుతూ.. వీడీ12 ప్రాజెక్ట్ రెండు పార్టులుగా రాబోతుందని ప్రకటించాడు. ఈ ఆలోచన సినిమా తీస్తున్న టైంలో రాలేదని.. షూటింగ్ స్టార్ట్ అవ్వకముందే ఈ ఆలోచన వచ్చినట్లు తెలిపాడు. అయితే ఈ రెండు పార్టులలో రెండు వేరు వేరు కథలు ఉంటాయని నాగవంశీ చెప్పుకోచ్చాడు. మరోవైపు ఈ సినిమాను వచ్చే ఏడాది మార్చిలో తీసుకురావడానికి ప్లాన్ చేస్తున్నట్లు తెలిపాడు. ఒకవేళ ఆ టైంలో పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు ఉంటే తమ సినిమాను వాయిదా వేయనునట్లు చెప్పుకోచ్చాడు.

# సల్మాన్‌ఖాన్ సికిందర్ టీజర్ వాయిదా




బాలీవుడ్ స్టార్ యాక్టర్ సల్మాన్ ఖాన్ కాంపౌండ్ నుంచి వస్తోన్న మోస్ట్ ఎవెయిటెడ్ సినిమాల్లో ఒకటి 'సికందర్'. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 2025 ఈద్ కానుకగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. మేకర్స్ ముందుగా ప్రకటించిన ప్రకారం టీజర్‌ను ఇవాళ ఉదయం 11:07 నిమిషాలకు లాంచ్ చేయాల్సి ఉంది.అయితే మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ గురువారం రాత్రి కన్నుమూసిన విషయం తెలిసిందే. దేశమంతా సంతాపం ప్రకటిస్తున్న ఈ సమయంలో ఆయన మృతికి సంతాపంగా టీజర్ లాంచ్ ఈవెంట్‌ను వాయిదా వేస్తున్నాం. టీజర్‌ను రేపు ఇదే (ఉదయం 11:07) సమయానికి లాంచ్ చేస్తామని అధికారిక ఖాతాలో ట్వీట్ చేసింది నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్. సికిందర్‌లో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రాన్ని నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సాజిద్ నడియాద్వాలా నిర్మిస్తుండగా.. సత్యరాజ్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. సమాజంలోని అవినీతి, నేరాలకు వ్యతిరేకంగా పోరాడే వ్యక్తి కథ నేపథ్యంలో ఈ సినిమా ఉండబోతుందని ఇన్‌సైడ్ టాక్.